Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 సంచిక: 160 హైదరాబాద్ మంగళవారం 20 -02 - 2024 పేజీలు: 8 రూ.4/-




## మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :**మూసీ నది పరీవాహక ప్రాంతం అభివృద్ధిపై నానక్‌రామ్‌గూడ హెచ్ఎండీఏ కార్యాలయంలో అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మూసీ రివర్ బౌండరీస్ లొకేషన్ స్కెచ్‌తో పాటు పలు వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. మూసీ అభివృద్ధిపై వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు కసరత్తు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు ముందుగా మూసీ క్లీనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోని చారిత్రక కట్టడాలను కలుపుతూ ఉండేలా మూసీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్న చెప్పారు. అధికారులకు పని విభజన చేసి మూసీ నదీ పరివాహక అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

## నిరుద్యోగులకు శుభవార్త



- 563 పోస్టులతో గ్రూపు-1 కొత్త నోటిఫికేషన్ విడుదల
- ఈనెల 23 నుంచి మార్చి 14 వరకు దరఖాస్తులు స్వీకరణ
- గతంలో దరఖాస్తు చేసుకున్న ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు: టిఎస్‌పిఎస్సీ

**తెలంగాణ వీణ/హైదరాబాద్**

తెలంగాణ నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్రూపు-1 కొత్త నోటిఫికేషన్ 563 పోస్టులతో సోమవారం టిఎస్‌పిఎస్సీ విడుదల చేసింది. ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు ఆన్‌లైన్‌లోదరఖాస్తులు స్వీకరించనుంది. గతంలో విడుదల చేసిన పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ తాజాగా ప్రకటన విడుదల చేసింది. 2022 ఏప్రిల్‌లో 503 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసింది. పేపర్ లీకేజీ కారణంగా ఒకసారి ప్రిలిమ్స్‌ను టిఎస్‌పిఎస్సీ రద్దు చేసింది. రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహించగా హైకోర్టు రద్దు చేసింది. సరైన నిబంధనలను పాటించకపోవడంతో రెండోసారి ప్రిలిమ్స్‌ను రద్దయ్యాయి. ఇటీవల మరో 60 గ్రూప్-1 పోస్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత నోటిఫికేషన్‌లో ఇచ్చిన 503 పోస్టులతో పాటు కొత్తగా కలిపి 60 పోస్టులు కలిపి మొత్తం 563 పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసినట్లు టిఎస్‌పిఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. **షెడ్యూల్ వివరాలు:** ఈనెల 23వ తేదీ నుంచి మార్చి 14 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వాటిని సవరణకు మార్చి 23 నుంచి 27వ తేదీ వరకు అవకాశం కల్పించింది. హాల్ టికెట్ డౌన్‌లోడ్ పరీక్ష ఏడు రోజుల ముందు నుంచి పరీక్ష ప్రారంభమయ్యే నాలుగు గంట ముందుకు అవకాశం ఇచ్చింది. గ్రూపు 1 ప్రిలిమినరీ పరీక్ష మే కానీ జూన్ నెలలో నిర్వహించనున్నారు. తేదీల వివరాలు అనేది తరువాత ప్రకటిస్తామని టిఎస్‌పిఎస్సీ తెలిపింది. గ్రూప్ మెయిన్ పరీక్ష 2024, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ఉండనుంది. గతంలో దరఖాస్తు చేసి వారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు: కాంగ్రెస్ ప్రభుత్వం పాత గ్రూపు-1 పరీక్ష రద్దు చేసిన అదనపు పోస్టులతో కొత్త నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల రాష్ట్రంలోని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా గ్రూపు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష నిర్వహించకముందే కొంతమంది ప్రభుత్వం పెద్దలు పేపర్ లీకేజి చేసి నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు రాజధాని నగరానికి వచ్చి కోచింగ్ సెంటర్‌లో లక్ష రూపాయలు చెల్లించి శిక్షణ తీసుకుని రాత్రింబళ్లు చదివి పరీక్షలు రాస్తే తీరా సమయానికి లీకేజీ చేయడంతో తమ జీవితాలు బుగ్గిపాలైయ్యాయని మండిపడుతున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల పట్ల తీసుకుంటున్న నిర్ణయాలు తమ ఎంతో సంతోషనిచ్చిందని పేర్కొన్నారు.

## బిఆర్ఎస్‌తో పొత్తు ఉండదు: కిషన్ రెడ్డి




**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు. బీజేపీ-బీఆర్ఎస్ మధ్య పొత్తు ఉంటుందని ఊహాగానాలు చెలరేగుతున్న సమయంలో కిషన్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం పాలైందనీ, కాంగ్రెస్ కూ అదే గతి పడుతుందని ఆయన చెప్పారు.రాష్ట్రంలోని అన్ని స్థానాలకూ బీజేపీ పోటీ చేస్తుందన్నారు. కేంద్రంలో మరొకసారి నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని చెప్పారు. ఈసారి హైదరాబాద్ లోక్ సభ స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటి ఆడబిడ్డలకు తీవ్ర అన్యాయం

2లో

- రోస్టర్ పాయింట్లు రద్దు చేయడంతో ఆడబిడ్డలకు తీవ్ర నష్టం
- రోస్టర్ పాయింట్లు లేని హారిజాంటల్ రిజర్వేషన్లు దారుణం
- ఆడబిడ్డల ఉద్యోగాలకు తెలంగాణలో భద్రత లేకుండాపోయింది
- తక్షణమే జీవో 3ను వెనక్కి తీసుకోవాలి - జీవోను ఉపసంహరించుకునేలా సిఎం రేవంత్ రెడ్డిని సోనియా గాంధీ ఆదేశించాలి - బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు
- సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ఎమ్మెల్సీ కవిత లేఖ



## పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్‌ను ప్రభుత్వం బలి పశువును చేసింది




**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** తెలంగాణ పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ , నిజాయితీకి మారు పేరైన డా. సబావత్ రాంచందర్‌పై అకారణంగా ప్రభుత్వం బదిలీ వేటు వేసి బలిపశువును చేసిందని బిఎస్పీ అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ట్విట్టర్ వేదిక స్పందిస్తూ కేవలం మూడు నెలల సర్వీసు మాత్రమే మిగిలి ఉన్న అధికారిని అందలమెక్కించారనడం సరికాదన్నారు. డా. రాంచందర్ తెలంగాణ తండాలలో జన్మించిన ఒక గిరిజన బిడ్డ కావడమే నేరమా, ఆయన గురించి ఏ ఎమ్మెల్యే, ఏ ఉన్నతాధికారి కూడా నోరు మెదపరని.. అతి నమ్మకంతో చేశారని మండిపడ్డారు.గొర్రె పిల్లల భకోణంలో కీలక పాత్ర వహించిన మంత్రులను, వాళ్ల ఓఎస్డీలను, ఆనాటి డైరెక్టర్లను ముట్టుకునే దమ్ము మీ కుందా అని నిలదీశారు. రిటైరైనా ఆధిపత్య వర్గాలకు చెందిన అధికారిని ఓఎస్డీగా అదే శాఖకు నియమించి మరీ యధేచ్ఛగా కుంభకోణం సాగించారు. ఆ అధికారిని సలహాదారుగా ఇంకా కొనసాగిస్తున్నారు. దాన్ని గురించి ఎవరూ మాట్లాడరని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గిరిజన వ్యతిరేక కాంగ్రెస్ చేస్తున్న దారుణాలను మన తండాల్లో, గూడేల్లో, పల్లె ప్రజలకు వివరించాలని కోరారు.

## మేడారం భక్తులకు టీఎస్ఆర్టీసీ బిగ్‌షాక్.. బస్సుల్లో కోళ్లు, గొర్రెలకు ప్రవేశం లేదు



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** మేడారం మహాజాతర వెళ్లే భక్తులకు టీఎస్ఆర్టీసీ షాక్ ఇచ్చింది. మేడారం బస్సుల్లో కోళ్లు, గొర్రెలు, మేకలకు ఎంట్రీ లేదని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మూగజీవాలను తీసుకురాకుండా భక్తులు సహకరించాలని సజ్జనార్ కోరారు. మేడారం జాతర నేపథ్యంలో సజ్జనార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మేడారం జాతర నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 6వేలకు పైగా బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. మునుపెన్నడూ లేని విధంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని మేడారంలో 15 కిలోమీటర్ల మేర 48 క్యూ లైన్లు ఏర్పాట చేసినట్లు చెప్పారు. మేడారం జాతరలో 15వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని ఎండీ సజ్జనార్ సూచించారు. మేడారం జాతరకు వచ్చే భక్తులు కోళ్లు,గొర్రెలు, మేకలను అమ్మవార్లకు మొక్కులుగా సమర్పిస్తున్న విషయం విదితమే.

## మేడారం జాతరకు తండోపతండాలుగా భక్తులు



- వనదేవతల జాతరకు అంతా సిద్ధం
- ఏటికేడు పెరుగుతున్న భక్తులు..
- జాతరకు కోటిన్నర భక్తుల రాక అంచనా
- ఎనిమిది రాష్ట్రాలనుండి పోటెత్తనున్న భక్తులు
- పైసా లేకుండా ఆర్టీసి సేవలు
- వరంగల్‌కు ప్రత్యేక రైళ్లు

**తెలంగాణ వీణ/ములుగు జిల్లా ప్రతినిధి:** ఆసియాఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ, గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం వన దేవతల మహా జాతరకు అంతాసిద్ధమయ్యింది. మేడారం జాతరకు భక్తులు ఇప్పటికే తండోపతండాలుగా తరలివస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ వనదేవతల జాతరకు ఈసంవత్సరం సుమారు కోటిన్నర మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటారని రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అంచనావేస్తున్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ దేవతలు ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్బాంధవులుగా, కేవలం తెలంగాణలోనే కాకుండా భారతదేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారు. ఈ జాతరను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1996 సంవత్సరంలో రాష్ట్ర పండగగా అప్పటి ప్రభుత్వం గుర్తించింది. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర వస్తుందంటే చాలు ఆదివాసీ గ్రామం అయిన మేడారం జనారణ్యంగా మారిపోతుంది.దేశవిదేశాల్లో భక్తులు ఎక్కడ ఉన్నా జాతర సమయంలో ఇక్కడకు వచ్చి ఎత్తు బంగారం, పూలు, చీర, సారలతో దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. గత రెండు నెలలముందునుండి మేడారం జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈనెల 21 నుండి 24 వరకు జరిగే జాతరకు గతంలో కంటె ఎక్కువ మొత్తంలో భక్తులు వస్తారని అధికార వర్గం అంచనా వేస్తుంది. మేడారం మహాజాతరకు తెలంగాణ రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒడిశా, అస్సాం, మధ్యప్రదేశ్, రాష్ట్రాలనుండి లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. దాదాపు ఎనిమిది రాష్ట్రాల నుండి భక్తులు పోటెత్తనున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ మహా జాతరకు ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగతూ వస్తోంది. కాకతీయుల రాజులతో పోరాటం చేసిన వీరవనితలు సమ్మక్క, సారలమ్మల జాతరకు సుమారు 900 ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. 1940

వివరాలు 2లో

# సమాజాన్ని ప్రభావితం చేసేది రచయితలే...

### హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్




**తెలంగాణ వీణ/హైదరాబాద్ :**సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా కవులు, రచయితలు, కళాకారులు తమ యొక్క చారిత్రకమైన పాత్రను పోషించాలని బిసి మంత్రిత్వ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఈ తరం సెల్ ఫోన్ లో, యూట్యూబ్ లలో మునిగితేలుతున్నారని, దాని నుంచి బయట పడాలంటే పుస్తక పఠనమే అందుకు సరియైన మార్గమని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగింపు సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పొన్నం మాట్లాడుతూ ఈ బుక్ ఫెయిర్ భిన్న భావాలకు కూడలి అని, భిన్న సంఘర్షణల కలయికని తెలిపారు.సమాజంలోని విభిన్న అంతరాలు, అసమానతలు పోవాలంటే పుస్తకాలు ఒక మార్గదర్శకంగా ఉపయోగపడతాయన్నారు. హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఈ పుస్తక ప్రతిష్ఠకు కావలసిన అన్ని రకాల ఏర్పాట్లను చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి, ప్రొఫెసర్ రమా మేల్కోటే, ఓయూ విసి డి. రవీందర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్. వాసు, ఉపాధ్యక్షులు పి. నారాయణ రెడ్డి, కోయా చంద్రమోహన్, కోశాధికారి పి రాజేశ్వరరావు, శృతికాంత్ భారతి, శోభన్ బాబు, జనార్ధన్ గుప్తా, సూరిబాబు, బాల్ రెడ్డి, కవి యాకూబ్‌లు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు వివాహ ఆహ్వానం



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** తమ కుమారుడు శివ్ అభిషేక్ , కావ్య దంపతుల వివాహ మహోత్సవానికి రమ్మంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డి పద్మావతి దంపతులు ఆహ్వానించారు. ఈ మేరకు చంద్రబాబును వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభలేఖను అందజేసి ఆహ్వానించారు.ది

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లురుని పరామర్శించిన మంత్రి పొన్నం



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :**ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుండి ధర్మపురి నియోజకవర్గం వెళ్తుండగా ఎండపల్లి మండలం అంబర్ పేట దగ్గర రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్యే అడ్లురీ లక్ష్మణ్ కుమార్ ఆరోగ్యం పై వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే అడ్లూరికి ప్రమాదం లేదని..కోలుకుంటున్నారని మంత్రికి తెలిపిన వైద్యులు.అనంతరం ఎమ్మెల్యే అడ్లురి లక్ష్మణ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటి ఆడబిడ్డలకు తీవ్ర అన్యాయం

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** ఇందిరమ్మ రాజ్యం పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇంటి ఆడబిడ్డలకు తీరని అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఉద్యోగావకాశాల్లో మహిళల హక్కలను హరించేలా రోస్టర్ పాయింట్లు లేని హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని మండిపడ్డారు. తెలంగాణలో ఆడబిడ్డలకే కాకుండా వికలాంగుల ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నియామకాల్లో ఆడబిడ్డలకు అన్యాయం జరిగే జీవో 3ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.జీవో 3ను వెనక్కి తీసుకునేలా సీఎం రేవంత్ రెడ్డిని ఆదేశించాలంటూ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సోమవారం నాడు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. ఈ సందర్భంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు మహిళలకు రోస్టర్ పాయింట్లతో కూడిన హారిజాంటల్ రిజర్వేషన్లు అమలవుతున్నాయని, మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్ ఇస్తూనే వర్టికల్ రిజర్వేషన్లతో సమానంగా అమలు చేయాలంటే రోస్టర్ పాయింట్లను పెట్టాలనే ప్రతిపాదన 1996లో తెరమీదికి వచ్చిందని పేర్కొన్నారు. దాంతో జవో 41, 56లను ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేశారు. 100 ఉద్యోగాల ఉంటే 33 ఉద్యోగాలు కచ్చితంగా మహిళలకు వస్తాయని, అదనంగా మరన్ని ఉద్యోగాలు కూడా వచ్చే ఆస్కారం ఉండేదని వివరించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం హారిజాంటర్ రిజర్వేషన్లు అమలు చేస్తూనే రోస్టర్ పాయింట్లు ఎత్తివేయడానికి జీవో 3ని తీసుకొచ్చిందని తెలిపారు. రోస్టర్ పాయింట్లు రద్దు చేయడం వల్ల 100 ఉద్యోగాల్లో మహిళలకు 33 ఉద్యోగాలు ఇవ్వాలన్న నిబంధనకు భంగం కలుగుతుందని, 33 కంటే తక్కువ ఉద్యోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకే తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం 16 ఉద్యోగాలు ఉంటేనే ఒక ఎస్సీ మహిళకు ఉద్యోగం వచ్చే అవకాశం ఉంటుందని ఉదాహరించారు. మహిళలకు రావాల్సిన ఉద్యోగాలు పురుషులకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇది రిజర్వేషన్ల స్ఫూర్తికి భంగం కలిగిస్తుందని, రిజర్వేషన్ల స్ఫూర్తిని తెలంగాణ ప్రభుత్వం తుంగలో తొక్కే నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు.టీఎస్పీఎస్సీ వెబ్ సైట్ లో దాదాపు 2 లక్షల 60 వేల మంది అభ్యర్థులు నమోదు చేసుకుంటే అందులో లక్ష మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఉదాహరణకు ఒకటి నుంచి 10 వరకు రోస్టర్ పాయింట్లు ఉంటే ఓసీలకు 3, ఎస్సీలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు ఒకటి చొప్పున పోస్టులు ఉన్నాయనుకుంటే బీసీ–సీ, ఎస్సీ మహిళకు ఉద్యోగం రావాలంటే శాఖలో కనీసం 16 నుంచి 20 ఉద్యోగాలు ఉంటే తప్పా వాళ్లకు న్యాయం జరగదని స్పష్టం చేశారు. కానీ ఓసీ ఆడబిడ్డకు మాత్రం కచ్చితంగా ఒక ఉద్యోగం వస్తుందని తెలిపారు.2022లో కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లలో ఆర్టీఏ ఉద్యోగాల భర్తీ చేపడితే గ్రూప్ 1 మల్టీజోన్ 1, గ్రూప్ 2 మల్టీజోన్ కింద 41 ఉద్యోగాలు ఉంటే మల్టీ జోన్ 1 కింద 19 ఉద్యోగాలు ఉన్నాయని, ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల పద్ధతిలో ఉద్యోగాల భర్తీ చేస్తే మహిళలకు 6 ఉద్యోగాలు వస్తాయని, కానీ మారిన పరిస్థితుల్లో మూడు ఉద్యోగాలు మాత్రమే మహిళలకు వస్తాయని వివరించారు. మల్టీజోన్ 2లో 23 ఉద్యోగాలు ఉన్నాయని, రోస్టర్ పాయింట్లు తీసివేయడం వల్ల కేవలం 14 శాతం మాత్రమే రిజర్వేషన్లు వస్తున్నాయని చెప్పారు. ప్రతీ శాఖపై ఈ ప్రభావం పడుతుందని అన్నారు. ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలను నిర్దేశించకపోతే ఆ సందర్భంలో అధికారులకు ఏది అనిపిస్తే అది చేస్తారని, తద్వారా మహిళల ఉద్యోగావకాశాలకు భద్రత ఉండబోదని స్పష్టం చేశారు. రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ హైకోర్టు సమర్థించిందని రాష్ట్ర ప్రభుత్వం సాకుగా చూపిస్తోందని, కానీ కేసీఆర్ ప్రభుత్వం దాన్ని అంగీకరించబోమని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసిందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆఘమేఘాల ఈ నెల 6న మీద హైకోర్టులో పిటిషన్ ను ఉపసంహరించుకుందని తెలిపారు.జీవో 3 ఈ ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్లకు వర్తిస్తుందా లేదా గతంలో కేసీఆర్ ప్రభుత్వం వేసిన ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్తిస్తుందా అన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు ప్రభుత్వం కల్పిస్తామంటుంటే 33 శాతం రిజర్వేషన్ల ప్రకారం మహిళలకు దాదాపు 66 వేల ఉద్యోగాలు రావాలని, కొత్త పద్ధతి ప్రకారం మహిళలకు 66 వేల ఉద్యోగాలు వస్తాయా రావా అన్న విషయంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సూచించారు. రిజర్వేషన్లలో మార్పులు చేసే ముందు మేధావులతో




సంప్రదింపులు చేశారా లేదా ? పబ్లిక్ సర్వీస్ కమిషన్ తొలి చైర్మన్ ఘంటా చక్రపాణి, మహిళా అభ్యర్థులు, మహిళా హక్కుల కోసం పోరాటం చేసే వాళ్లలో మాట్లాడారా ? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.సిఎం రేవంత్ రెడ్డి రాజకీయాలపై పెట్టే దృష్టి రోస్టర్ పాయింట్లపై పెట్టి ఉంటే ఈ రోజు ఆడబిడ్డలకు అన్యాయం జరిగేది కాదని అన్నారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగే జీవో3ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు. జీవో 3ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏమిటో సోనియా గాంధీ చెప్పాలన్నారు. జీవోను వెనక్కి తీసుకోవాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డికి ఆదేశాలు జారీ చేయాలని సోనియా గాంధీకి విజ్ఞప్తి చేశారు.భయాందోళనలు సృష్టిస్తూ బిడ్డల చావుల మీద రాజకీయం చేసి ఓట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ పార్టీ ఈ రోజు ఆడబిడ్డలకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. రాజస్థాన్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును బిహార్, కర్నాటక వంటి రాష్ట్రాలు పాటించబోమని ప్రకటించాయని, మరి తెలంగాణ ప్రభుత్వానికి అంత ఆతృత ఎందుకని ప్రశ్నించారు. కొత్త జీవో తీసుకొచ్చి తెలంగాణలో ఆడబిడ్డల నోట్లో కాంగ్రెస్ ప్రభుత్వం మట్టి కొడుతోందని మండిపడ్డారు. ఆడబిడ్డలకు వచ్చే ఉద్యోగాలకు గ్యారెంటీ లేదంటే వారి తల్లిదండ్రులు చదువులు మానిపించే ప్రమాదం ఉందని అన్నారు. అందరూ ఆడబిడ్డల కోసం పోరాటం చేస్తున్న ఈ తరుణంలో ఉన్న హక్కలను హరించడాన్ని ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# మేడారం జాతరకు తండోపతండాలుగా భక్తులు

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరంలో చిలకల గుట్టపై గిరిజనులు మాత్రమే జరుపుకునేవారు. తర్వాత తెలంగాణ ప్రజలంతా కలిసి జరుపుకుంటున్నారు. భక్తుల సంఖ్యలక్షలలోకి చేరుకోవడంతో ప్రభుత్వాలు దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో జరిపుకునేలా ప్రారంభించారు.

### సమ్మక్క, సారలమ్మల చరిత్ర బయ్యక్కపేట నుండి మొదలు

మ్మక్క పుట్టిన ఊరుగా చరిత్ర పాశస్త్రంలో ఉన్న బయ్యక్కపేట లోనే పూర్వకాలం నుండి గుడిఉంది. ఇక్కడ చందా వంశస్తులు నిత్య పూజలు నిర్వహిస్తారు. బయ్యక్కపేట పూజారులు చూపుతున్న ఆధారాలను బట్టి పూర్వం బయ్యక్కపేట లోనే సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహించేవారు. చందా వంశీయులే ఇక్కడ తలపతులుగా వ్యవహరిస్తారు. జాతరను జరిపే చందావంశస్తులు ఈ చుట్టుపక్కల కోయగూడెలలోనే ఉన్నారు. బయ్యక్కపేటలో కరువుకాటకాలవల్ల జాతరను నిర్వహించే శక్తిసన్నగిల్లడం వలన సమ్మక్క, సారలమ్మ జాతరను బయ్యక్కపేటనుండి మేడారానికి మార్చారు. ఈ క్రమంలో వారు రాసుకున్న ఒప్పందాల మేరు చందా వంశీయులు మేడారం జాతర హుండీ ఆదాయంలో వాటా పొందుతున్నారు.


### పైసా ఖర్చులేకుండా దర్శనం చేసుకునే ఏకైక జాతర

గత ప్రభుత్వాలు మేడారం జాతరకు ఆర్టీసి ద్వారా భక్తులను చేరవేయడానికి సమాయత్తం అయ్యేది. కానీ తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కాంగ్రెస్ ఏర్పడగా సీఎం రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించింది. తెలంగాణ ఆర్టీసి గతంలో కంటె అధికంగా ఈసారి 6వేల బస్సులను నడపనున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉచిత ప్రయాణం ద్వారా మహిళ భక్తులు పైసా ఖర్చులేకుండా మేడారం సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శనం చేసుకుని వెళ్లవచ్చు.

### మేడారం జాతరకు 30 జన్ సాధన్ ప్రత్యేక రైళ్లు

దక్షిణ మధ్య రైల్వే శాఖ మేడారం మహాజాతర ఈనెల 21 నుండి 24 వరకు సికింద్రబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలనుండి 30 రైళ్లను వరంగల్ కు నడపనున్నట్లు తెలిపింది. వివిధ జిల్లాలనుండి మేడారం జాతరకు వచ్చే భక్తులు రైలుమార్గం ద్వారా వరంగల్ కు చేరుకుని అక్కడి నుండి బస్సులలో మేడారం చేరుకుని సమ్మక్క, సారలమ్మల దర్శనం చేసుకునే విధంగా ప్రత్యేక రైళ్లు నడుతుపుతున్నట్లు ప్రకటించింది.

## ఆదివాసీ మహిళ కావడంతో రామాలయ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ముర్మును అనుమతించలేదు : రాహుల్ గాంధీ



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదివాసీ మహిళ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మోదీ సర్కార్ అనుమతించలేదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. యూపీలోని అమేథిలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ పర్యటించారు. ద్రౌపది ముర్ము ఆదివాసీ మహిళ అయినందునే ఆమెను ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదని అన్నారు. రామాలయ ప్రారంభ వేడుకను ఆర్భాటంగా నిర్వహించినా..అక్కడ మీకు ఎవరైనా దళితులు కనిపించారా అని రాహుల్ ప్రజలను ప్రశ్నించారు.మన రాష్ట్రపతి ఆదివాసీ కావడంతో ఆమెను ఈ కార్యక్రమానికి హాజరు కానీయకుండా దూరం పెట్టారని అన్నారు. ఆ కార్యక్రమంలో మీరు ఎవరైనా రైతు, కార్మికులను చూశారా అని అడిగారు. అసలు ఆ కార్యక్రమంలో ఎక్కడా ఓబీసీ ప్రజలు కనిపించలేదని అన్నారు. వ్యాపార వేత్తలంతా అక్కడే ఉన్నారు. అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యా రాయ్, నరేంద్ర మోదీ అక్కడే ఉన్నారని గుర్తుచేశారు.భారత్ అణగారిన వర్గాల వారిదే..మీది కాదు..మీరు పైకి మాత్రం భారత్ మాతా కీ జై అంటూ హెలికాప్టర్లలో తిరుగుతూ సొమ్ము చేసుకుంటారని కాషాయ పాలకులను ఉద్దేశించి రాహుల్ ఆరోపణలు గుప్పించారు. తాము అధికారంలోకి రాగానే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని పునరుద్ఘాటించారు.రైతులను దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. వారేం గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. కేవలం మద్దతు ధరకు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు. అదేమీ పెద్ద విషయం కాదని రాహుల్ పేర్కొన్నారు. ఇక తాము అదికారం చేపడితే కుల గణన నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కుల గణన చేపట్టి దేశవ్యాప్తంగా ఓబీసీ, దళితులు, గిరిజనుల జనాభా శాతాన్ని నిర్ధారిస్తామని స్పష్టం చేశారు.

# టెంపుల్ టూరిజానికి ప్రాధాన్యత

### - పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

### - జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

**తెలంగాణ వీణ/అలంపూర్/హైదరాబాద్:** ఐదో శక్తి పీఠంగా విరాజిల్లుతున్న అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక విలువలు పెంపొందిస్తూ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జోగులాంబ అమ్మవారిని మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి జూపల్లికి అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించారు. మంత్రికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ జోగులాంబ ఆలయంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, టెంపుల్ టూరిజానికి ప్రాధన్యతనిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీంలో భాగంగా చేపట్టిన పనులు ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. భక్తుల సౌకర్యాల నిమిత్తం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎంఎల్‌ఏలు మేఘారెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, మాజీ ఎంఎల్‌ఏ సంపత్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# కొత్త పథంలో వ్యవసాయం


- రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- సహజ సాగు, సిరి ధాన్యాలపై దృష్టి కేంద్రీకరింపు
- లక్నో కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రకటన



**తెలంగాణ వీణ/లక్నో :** వ్యవసాయాన్ని కొత్త పథంలో తీసుకువెళ్లడంలో రైతులకు తన ప్రభుత్వం సాయం చేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం వెల్లడించారు. సహజ సాగు, సిరి ధాన్యాల ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని మోడీ తెలియజేశారు. ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో ఒక కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా డైనింగ్ టేబుళ్లపై భారతీయ ఆహార ఉత్పత్తులు ఉండాలన్న ఉమ్మడి లక్ష్య సాధనకు కృషి చేయడం ముఖ్యమని ఉద్ఘాటించారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధమైన గ్యారంటీ వంట వివిధ డిమాండ్లపై ఒక వర్గం రైతులు నిరసనోద్యమం సాగిస్తున్న తరుణంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'మన దేశ వ్యవసాయాన్ని కొత్త పంథాలో తీసుకువెళ్లేలా రైతులకు మేము సాయం చేస్తున్నాం. వారిని అందులో ప్రోత్సహిస్తున్నాం' అని ప్రధాని తెలిపారు. సహజ సాగు పద్ధతులపైన, సిరి ధాన్యాల ఉత్పత్తిపైన దృష్టి కేంద్రీకరించాలని ఆయన పిలుపు ఇచ్చారు. 'సిరి ధాన్యాలు వంటి సూపర్ ఆహారధాన్యాలపై పెట్టుబడికి ఇది సరైన సమయం' అని ప్రధాని అన్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని గంగా నది తీరం పొడుగునా భారీ ఎత్తున సహజ సాగు పద్ధతులు అనుసరిస్తుండడాన్ని ప్రధాని మోడీ ప్రస్తావించారు. అది రైతులకు ప్రయోజనకరమే కాకుండ పవిత్ర నదుల పరిశుద్ధత పరిరక్షణకు దోహదం చేస్తున్నదని ఆయన అన్నారు.తమ తమ యత్నాలలో 'ప్రభావ రహితం, లోప రహితం' మంత్రానికి ప్రాధాన్యం ఇవ్వవలసిందిగా ఫుడ్ ప్రాసెసింగ్ పారిశ్రామికవేత్తలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. సిద్ధార్థ్ నగర్ కాలానమక్ బియ్యం, చందౌలి నల్ల బియ్యం వంటి ఉత్పత్తుల విజయ గాథలను ప్రధాని మోడ ప్రధానంగా ప్రస్తావించారు. ఆ ఉత్పత్తులను ప్రస్తుతం గణనీయమైన పరిమాణంలో ఎగుమతి చేస్తున్నారు. భారతీయ ఆహార ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సంఘటిత కృషి అవసరమని మోడీ సూచించారు. రైతులతో భాగస్వామ్యం నెలకొల్పుకోవలసిందిగా పారిశ్రామికవేత్తలను ప్రధాని ప్రోత్సహిస్తూ, వ్యవసాయ ఉత్పాదక సంస్థలు, సహకార సంస్థల ద్వారా చిన్న రైతులను సాధికారులను చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి గురించి వివరించారు. 'రైతులకు, వ్యవసాయానికి ప్రయోజనమే కాకుండా మీ వ్యాపారానికీ మేలు' అని మోడీ పెట్టుబడిదారులతో అన్నారు.మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్‌కు భారత రత్న అవార్డు ప్రకటన గురించి మోడీ ప్రస్తావించారు. 'కొన్ని రోజుల క్రితం మా ప్రభుత్వం రైతుల శ్రేయోభిలాషి చౌదరి చరణ్ సింగ్‌కు భారత రత్న ప్రకటించే అవకాశం పొందింది' అని ప్రధాని తెలిపారు. ఉత్తర ప్రదేశ్ భూమి పుత్రుడు చరణ్ సింగ్‌కు అవార్డు దేశంలోని కోట్లాది మంది కూలీలు, రైతులను గౌరవించమే అవుతుంది' అని మోడీ అన్నారు. యుపి గ్లోబల్ ఇన్వెస్టర్స్ శిఖరాగ్ర సదస్సు సమయంలో అందిన పెట్టుబడి ప్రతిపాదనలకు సంబంధించి సోమవారం లక్నోలో నాలుగవ శంకుస్థాపన కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ వ్యాప్తంగా రూ. 10 లక్షల కోట్లకు మించి విలువ చేసే 14 వేల ప్రాజెక్టులకు మోడీ నాంది పలికారు. తయారీ, పునరుత్పాదక ఇంధన శక్తి, ఫుడ్ ప్రాసెసింగ్, గృహవసతి, స్థిరాస్తి, ఆతిథ్య, వినోద, విద్య వంటి రంగాలకు సంబంధించినవి ఆ ప్రాజెక్టులు. యుపి గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రభృతులు హాజరయ్యారు.

# చందా కొచ్చర్ అరెస్టు 'అధికార దుర్వినియోగం'

- సిబిఐపై బాంబే హైకోర్టు ఆగ్రహం



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** వీడియోకాన్ రుణం మోసం కేసులో ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌ల అరెస్టు విషయంలో సిబిఐ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో కొచ్చర్ జంటకు కోర్టు బెయిల్ పిటిషన్‌ను ఆమోదించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ తన అధికారాలను దుర్వినియోగం చేసిందని విచారణ సందర్భంగా కోర్టు సిబిఐని మందలించింది. ఈ అరెస్టు అవసరమని నిరూపించే సాక్ష్యాలను సమర్పించడంలో సిబిఐ విఫలమైందని హైకోర్టు పేర్కొంది.ఈ అరెస్టు చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది. విచారణకు చందా కొచ్చర్, ఆమె భర్త సహకరించడం లేదన్న సిబిఐ వాదనను అంగీకరించేందుకు కూడా కోర్టు నిరాకరించింది. రాజ్యాంగం ప్రకారం విచారణ సమయంలో మౌనంగా ఉండే హక్కు నిందితుడికి ఉందని, దీన్ని విచారణకు సహకరించకపోవడంగా పరిగణించలేమని కోర్టు తెలిపింది. రూ.3,250 కోట్ల వీడియోకాన్ రుణం కేసులో 2022 డిసెంబర్ 23న కొచ్చర్ దంపతులను అరెస్టు చేశారు.చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్‌ల అరెస్ట్ చట్టవిరుద్ధమని బాంబే హైకోర్టు బెంచ్ గతంలో ప్రకటించింది. 2023 జనవరి 9న అరెస్టు అయిన వెంటనే కొచర్ దంపతులకు బెంచ్ బెయిల్ మంజూరు చేసింది. కొచ్చర్‌తో పాటు వీడియోకాన్ గ్రూప్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్ ధూత్‌ను కూడా సిబిఐ అరెస్టు చేసింది. ఆయనకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో బెయిల్ కూడా మంజూరు చేసింది. బ్యాంకింగ్ నిబంధనలు, ఆర్‌బిఐ మార్గదర్శకాలు, బ్యాంక్ క్రెడిట్ విధానాన్ని ఉల్లంఘించి వీడియోకాన్ గ్రూపు కంపెనీలకు రూ.3,250 కోట్ల రుణాలను ఐసిఐసిఐ బ్యాంక్ తప్పుగా మంజూరు చేసిందని సిబిఐ ఆరోపించింది. బ్యాంకు రుణాల కేసులో మోసం చేసిన కేసులో కొచ్చర్ దంపతులను అరెస్ట్ చేశారు.

## మావోయిస్టుల కంచుకోట భద్రతా దళాల కైవసం

**తెలంగాణ వీణ/సుక్మా:** మావోయిస్టులు ఒకప్పుడు సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన ఛత్తీస్‌గఢ్‌లోని పువర్తి గ్రామంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారి భారత జాతీయ పతాకం ఎగిరింది. ఈ గ్రామంలో మొట్టమొదటిసారి భద్రతా దళాలు ఒక పోలీసు క్యాంపును కూడా ఏర్పాటు చేశాయి. ఇది మావోయిస్టుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయగలదని పోలీసులు భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న పువర్తి నిషిద్ధ మావోయిస్టు పార్టీకి చెందిన స్వయం ప్రకటిత కమాండర్ హిడ్మాకు, అతని వారసుడు బర్సా దేవాకు స్వగ్రామం.ఈ గ్రామం నుంచే మావోయిస్టులు భద్రతా దళాలపై దాడులు జరిపేందుకు వ్యూహ రచనలు చేసేవారు. ఒక చెవువు, పొలాలు ఉన్న ఈ గ్రామంలో భద్రతా బలగాలను దీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయి. ఆదివారం ఈ గ్రామాన్ని సిఆర్‌పిఎఫ్, రాష్ట్ర పోలీసులకు చెందిన అధికారుల బృందం తనిఖీ చేసింది. మావోయిస్టుల కంచుకోటగా ఒకప్పుడు ఉన్న ఈ గ్రామంలో అటువైపుగా వెళ్లే వారి కదలికలను రహస్యంగా కనిపెట్టడానికి అవసరమైన నిఘా ఏర్పాట్లు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.గ్రామం నడిబొడ్డున స్కూలుగా ఉన్న ఒక ఇంటిని మావోయిస్టులు తమ విశ్రాంతి గృహంగా మార్చుకున్నారు. ఆ ఇంటి చుట్టూ కూరగాయల మొక్కలను మావోయిస్టులు పెంచుకునేవారు. ఇప్పుడు ఆ ఇంటిని కూడా భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అనేక కిలోమీటర్ల విస్తారంలో ఉన్న ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు తమ శిక్షణా శిబిరాల కోసం వినియోగించుకునేవారు. సమీపంలోని గ్రామాలు, తండాల నుంచి యువకులను రిక్రూట్ చేసుకుని వారికి శిక్షణ ఇచ్చేందుకు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు ఉపయోగించేవారు.మావోయిస్టుల పనితీరు, భద్రతా దళాలపై దాడులు జరపడానికి పన్నిన వ్యూహాలను అవగతం చేసుకోవడానికి ఈ గ్రామ సందర్శన తకు ఉపయోగపడుతుందని భద్రతా దళాలు భావిస్తున్నాయి. ఒకప్పుడు భద్రతా దళాలు, పోలీసులు అడుగెపెట్టడానికి భయపడిన గ్రామంలో ఇప్పుడు పోలీసు క్యాంపు వెలసింది. ఇలాంటివే మరో ఏడు క్యాంపులు గత కొద్ది నెలలుగా మావోయిస్టుల ఒకనాటి స్థావరాలలో ఏర్పడ్డాయి. ఈ క్యాంపులు మావోయిస్టుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని పోలీసులు అంచనా వేస్తున్నారు. పువర్త గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు క్యాంపు ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడి నుంచి నిమిషాల వ్యవధిలోనే మావోయిస్టుల కదలికలు ఉన్న ప్రాంతాన్ని భద్రతా దళాలు చేరుకోవచ్చు.గతంలో ఆయా ప్రాంతాలను చేరుకోవాలంటే పోలీసులకు అనేక గంటల సమయం పట్టేది. కాగా..పువర్తి గ్రామంలో హిడ్మా తల్లిని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ ఆదివారం కలుసుకుని ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయాన్ని అందచేస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టు కార్యకలాపాల నుంచి దూరంగా ఉండాలని, ప్రభుత్వ పథకాలన్నీ అందేలా చూస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామస్తుల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఆయన చెప్పారు. జనవరి 30న టేకల్‌గూడ పోలీసు క్యాంపుపై మావోయిస్టులు దాడి జరిపి ముగ్గురు సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని హతమార్చిన నేపథ్యంలో పోలీసులు పువర్తి గ్రామాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ దాడిలో పలువురు సైనికులు గాయపడ్డారు.



## ఛండీగఢ్ మేయర్ రాజీనామా



**తెలంగాణ వీణ/చండీగఢ్ :** చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సుప్రీం కోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో విచారణకు ఒక రోజు ముందే మేయర్ అభ్యర్థి బీజేపీ నేత మనోజ్ సోంకర్ ఆదివారం రాత్రి రాజీనామా చేశారు. సోంకర్ తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు, ఛండీగఢ్ బీజేపీ అధ్యక్షుడు జతీందర్ పాల్ మల్హోత్రాకు సమర్పించారు. మేయర్ సోంకర్ ఈరోజు తన పదవికి రాజీనామా చేశారని, ఎన్నికల అంశం కోర్టు విచారణ పరిధిలో ఉందని, సుప్రీం కోర్టు రేపు ( సోమవారం ) నిర్ణయిస్తుందని జతీందర్ పాల్ ఆదివారం వెల్లడించారు.ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు పూనం దేవి, నేహా , గురుచరణ్ కాలా, మూడు రోజులు క్రితమే తమ పార్టీని విడిచిపెట్టి ఆదివారం బీజేపీలో చేరడంతో ఈ ఎన్నికలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల జరిగిన మేయర్ ఎన్నికల్లో బీజేపీకి 16 ఓట్లు రాగా, కాంగ్రెస్ ఆప్ ఉమ్మడి అభ్యర్థి కుల్దీప్ సింగ్‌కి 12 ఓట్లు వచ్చాయి. అయితే మొత్తం 36 ఓట్లలో 8 చెల్లవని ప్రకటించడంతో వివాదం మొదలైంది. జనవరి 30న ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్, ఆప్ కౌన్సిలర్లు బీజేపీ మోసం చేసిందని , ఎన్నికల ప్రక్రియ సరిగ్గా సాగలేదని ఆరోపించడం గందర గోళానికి దారి తీసింది. ప్రిసైడింగ్ అధికారి అనిల్‌మసీహ్ బ్యాలెట్ పేపర్లను ట్యాంపరింగ్ చేస్తూ పట్టుబడ్డారని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది.దీనికి సంబంధించిన వీడియో కూడా సుప్రీం కోర్టుకు సమర్పించారు. దీనిపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు విచారణ జరుగుతున్న సమయంలో మేయర్ రాజీనామా చర్చనీయాంశం అయింది.


## మేరులను బిసి- ఏ లోకి మార్చండి

- మంత్రి పొన్నంకు మేరు కులస్తుల వినతి

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** స్వాంతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా చేనేత కార్మికుల అనుబంధమైన మేరు దర్జీ కులస్తుల విషయంలో కేంద్ర చేనేత, జౌళి శాఖ ఉదాసీన వైఖరిని అవలంభిస్తోందని మేరు యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పోల్కం శ్రీనివాస్ మేరు, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్‌లు ఆరోపించారు. ఈ మేరకు రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మేరు కుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మనిషీ జీవితంలో కూడు, గుడ్డ , గూడు ఎంత ముఖ్యమో చేతి వృత్తులలోనూ మేరు (దర్జీ ) వృత్తి అంతే ముఖ్యమైనదన్నారు. దర్జీ పని లేనిదే మానవుడికి మనుగడనే లేదన్నారు. ఇంత కీలకమైన వృత్తిలో పని చేస్తున్న తమ మేరు కులాన్ని బిసి ఏ కేటగిరిలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం తమను బిసి డిలో ఉంచారని అది కరెక్ట్ కాదన్నారు. పూర్వం అంగట్లో మిల్ నుండి వచ్చే బట్టలను అక్కడికక్కడే చింపి కుట్టి ఇచ్చే వాళ్లమని దీంతో తమకు 'చిప్పోలు' అని కులసర్టిఫికెట్ ఇస్తు వస్తున్నారని అది తప్పు అన్నారు. నేటి ఆధునిక యుగంలో ..రేడీమేడ్ వస్త్ర మిల్లులు వచ్చి తమ దర్జీలకు జీవనోపాధి లేకుండా చేశాయన్నారు.దీనిపై గత ప్రభుత్వాలకు ఎన్నో సార్లు చెప్పినా విస్మరించాయన్నారు. అంతే కాకుండా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తమ మిత్ర పక్ష పార్టీ మెప్పుకోసం 20 వేల కుట్టు మిషన్లను ముస్లిం మైనారిటీలకు రంజాన్ సందర్భంగా ఇచ్చి దర్జీలమైన తమను విస్మరించిందని పోల్కం శ్రీనివాస్ మేరు, ఆదిమూలం శంకర్‌లు ఆరోపించారు. తమ కులానికి బిఆర్‌ఎస్ అన్యాయం చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తాము ఎన్నో ఆశలు పెట్టుకున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు యూనిఫాంలను కుట్టే అవకాశం తమ కులానికి మాత్రమే ఇవ్వాలని, మేరు కులానికి ఫెడరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నంను కలిసిఇంకా ఈ కార్యక్రమంలో గంగాపురం దశరథ్, రైతు సంఘం చౌటుప్పల్ మండలం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, పోల్కం వినయ్ రాజ్, మునగాల రమేష్ పాల్గొన్నారు.



## వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



**తెలంగాణ వీణ/చింతలపూడి:** చింతలపూడి మండలం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలచిందని రాష్ట్రానికి తలమానికం అని వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపగడపకు ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చింతలపూడి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కంభం విజయరాజు అన్నారు. వాలంటీర్లు చేసిన సర్వీసులకు వాలంటీర్లకు వందనం అనే కార్యక్రమంలో వారిని శాలువాలతో, బ్యాడ్జి లతో సర్టిఫికెట్ లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు మరియు చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జె జానకి రెడ్డి, ఎంపీపీ బి రాంబాబు జడ్పిటిసి ఎం నీరజ, సచివాలయ కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పలువురు వైయస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి చూస్తున్న డిసిహెచ్ఎస్ పాల్ సతీష్



**తెలంగాణ వీణ/ఏలూరు రూరల్:** జీలుగుమిల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్న పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని, ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డా. పాల్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర వసతి గృహంలోని 42 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వెంటనే వసతి గృహంలో మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్యం అందించడం జరిగిందన్నారు. వారిలో ఇద్దరు విద్యార్థులను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని, వారి ఆరోగ్య పరిస్థితితో పాటు వసతి గృహంలోని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడే వరకు వసతి గృహంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని డా. పాల్ సతీష్ తెలియజేసారు.

## పెళ్లి పేరుతో బాలికను నమ్మించి.. లైంగికదాడికి పాల్పడ్డ యువకుడు

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** సోషల్ మీడియాలో పరిచయమైన ఓ బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి ఆమెకు దగ్గరయ్యాడు ఓ యువకుడు. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి, నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక గర్భం దాల్చడంతో ఈ విషయం వెలుగు చూసింది.వివరాల్లోకి వెళ్తే.. అమీర్‌పేట్‌కు చెందిన నవీన్ కుమార్(19) బైక్ మెకానిక్ చేస్తూ జీవనం గడుపుతున్నాడు. అతనికి సోషల్ మీడియాలో పటాన్‌చెరుకు చెందిన 16 ఏండ్ల బాలిక పరిచయమైంది. దీంతో ఆమెను ప్రేమిస్తున్నట్లు నమ్మించాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టాడు. కొన్ని నెలల తర్వాత నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి.. ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అయితే బాలికకు ఇటీవలే ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో బాలికను గాంధీ హాస్పిటల్‌కు తరలించగా, ఆమె గర్భిణి అని తేలింది. దీంతో తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. బాలికతో పాటు ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నవీన్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాలికకు చికిత్స కొనసాగుతోంది.



# మల్కాజిగిరి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు...

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు...
- చోద్యం చూస్తున్న అధికారులు..









**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** మల్కాజగిరి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డు అదుపు లేకుండా పోతోంది. నిబంధనలను ఉల్లంఘించిన బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకొవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పర్యవేక్షణ లొపంతోనే బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నాయని పలువురు ఆరొపిస్తున్నారు.సర్కిల్ పరిధిలోని మల్కాజిగిరి,గౌతంనగర్ ,మౌలాలి, నేరెడిమేట్, ఈస్ట్అనందబాగ్,వినాయక్ నగర్ డివిజన్ లలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తోన్న నిర్మాణాలు జోరుగానే కొనసాగుతున్నాయి. ఇక్కడ ఇష్టారాజ్యంగా వెలుస్తున్నా అక్రమ నిర్మాణాలను అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన తర్వతే అక్రమ నిర్మాణామని కూల్చివేతలు చేపడుతున్న అధికారులకు ప్రారంభ దశలోనే ఎందుకు గుర్తించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే ఇటీవల కొన్ని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్న అధికారులు సర్కిల్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాలన్నింటిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలున్నాయి. నిబంధనలను ఉల్లంఘించి చేపడుతున్న బహుళ అంతస్థుల నిర్మాణాలన్నింటిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా కొన్నింటిపైనే ప్రతాపం చూపుతున్నారనే ఆరొపనలు వినిపిస్తున్నాయి. రెసిడేన్షియల్ నిర్మాణాలకు అనుమతులు తీసుకుని కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నా, ఆదనపు అంతస్తుల నిర్మాణాలు వెలుస్తోన్న అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్కిల్ పరిధిలో చేపట్టే అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కొరుతున్నారు.

## నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు ప్రతిష్మాతక అవార్డుల పంట



**తెలంగాణ వీణ/నాచారం:** నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (కేంబ్రిడ్జ్ ఇంటర్నేషన్ కరిక్యులమ్)కు ప్రతిష్టాత్మక మూడు అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా 2024, ఫిబ్రవరి 19న స్కూల్ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ మల్కా కొమరయ్య మాట్లాడుతూ.. ఈ అవార్డులు తమకెంతో ఆనందంగా, ప్రోత్సాహాన్ని అందించాయన్నారు. ఫిబ్రవరి 15న జరిగిన కేంబ్రిడ్జ్ స్కూల్ కాంక్లేవ్ – సౌత్ ఏషియా, ఎక్సలెన్స్ రికగ్నిషన్ అవార్డ్స్ వేడుకలో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మూడు అవార్డులను అందుకుంది.గత దశాబ్ద కాలంగా నిబద్ధత, అంకితభావంతో విద్యను అందిస్తున్న ఈ స్కూల్ కు 'ది ఇన్నోవేటివ్ టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డు'ను కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ బిజినెస్ హెడ్ మనిష్ దోషి అందించారు. అలాగే రెండో అవార్డ్ అయిన 'బెస్ట్ కేంబ్రిడ్జ్ స్కూల్ ఫర్ ఎర్లీ ఇయర్స్ ఎడ్యుకేషన్' ను కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ ఇంటర్నేషనల్ నెట్వర్క్ డైరెక్టర్ బెన్ స్కిమిడ్, సౌత్ ఏషియా రీజినల్ డైరెక్టర్ మహేశ్ శ్రీవాస్తవ అందించారు. మూడో అవార్డైన 'ది అవుట్ స్టాండింగ్ అచీవ్మెంట్ అవార్డు–సౌత్ ఏషియా'ను కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ రాజమణి అందించారు. ఈ ప్రతిష్టాత్మక మూడు అవార్డులు.. స్కూల్ యాజమాన్య నిబద్ధత, ఉపాధ్యాయుల అంకిత భావం, విద్యార్థులకోసం రూపొందిస్తున్న పరిశోధనాత్మక కరిక్యులమ్, హై స్టాండర్డ్స్ కు గుర్తింపుగా లభించాయని మల్కా కొమరయ్య అన్నారు.విద్యను అందించడంలో డైరెక్టర్ మల్కా పల్లవి, సీఈఓ మల్కా యశస్వి, సీనియర్ ప్రిన్సిపాల్ సునీతారావ్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఎస్ ఎఫ్ శాంతి ఆంథోనీలు ఎప్పుడూ కొత్త ఒరవడికి నాంది పలుకుతుంటారని, విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మల్కా కొమరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యంగ్ మైండ్స్ ని దశలవారీగా అద్భుతంగా తీర్చిదిద్దుతున్న స్కూల్ ఎర్లీ ఇయర్స్ హెడ్మిస్ట్రెస్ శ్రీమతి శివాని నథన్, హెడ్మిస్ట్రెస్ శ్రీమతి యామిని హిమబిందు, అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీ సునీల్ తివారీ, అడ్మినిస్ట్రేటర్స్ నాన్సీ థామస్, సెలిన్ శి లాజరస్, ప్రశాంత్ దీపక్బాయ్ జోషిలను ఆయన అభినందించారు. ఈ విజయంలో విద్యార్థుల కోసం కృషి చేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడి పాత్రా ఉందన్నారు. భవిష్యత్ లో తాము మరింత బాధ్యతగా, అంకితభావంతో విద్యార్థుల కోసం పని చేస్తామని హామీ ఇచ్చారు.

## ఛత్రపతి శివాజి మహారాజ్ జయంతి వేడుకలో తుంగతుర్తి రవి




**తెలంగాణ వీణ/ఉప్పల్:** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని 17వ డివిజన్లో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొని ఈ కార్యక్రమం లో వారు మాట్లాడుతూ అతని తల్లి జీజాబాయి,తండ్రి శహాజీ మొఘల్ చక్రవర్తి సైన్యంలో ఉన్నారు. అయితే జీజాబాయికి హిందూమతాన్ని పునరుద్ధరించాలనేది పెద్ద కల. తన కొడుకుకు స్ఫూర్తినిచ్చే కథలు చెబుతూ, అతనిలో ధైర్యాన్ని నింపి హిందూ సామ్రాజ్యాన్ని పునర్నిర్మించాడు. భారతదేశ చరిత్రలో గొప్ప యోధులు, సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ పేరుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆయన పేరు వింటే హిందూ మతం ఉత్సాహంతో ఉప్పొంగిపోతుంది. చిన్నతనంలోనే మొఘలుల దాడులలో హిందూ మతం అంతరించి పోతుందని, వారితో యుద్ధంలో ఓడిపోయి అందరూ చేతులెత్తేసిన వేళ శివాజీ మహారాజు మండే నిప్పు కణికలా దూసుకొచ్చాడు. మొగల్ రాజులతో ఎంతో వీరోచితంగా పోరాడాడు. అందుకే హిందూమతాన్ని కాపాడిన ఘనత ఒక్క మరాఠా మహారాజు శివాజీకే దక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.భారతావనిలో చాలా మంది రాజులు పరిపాలించినప్పటికీ ఈ లక్షణాలే శివాజీని గొప్పరాజుగా చేశాయి. శివాజీ దేవి భక్తుడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడొంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ఛత్రపతి శివాజీ మహారాష్ట్ర, కర్నాటక మరియు ఆంధ్రాలో శక్తివంతమైన సుల్తానుల అందరికీ మరియు వారి సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడు. మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, మరాఠా వీరుడిగా పేరుగాంచిన భరతమాత ముద్దుబిడ్డ, స్త్రీని గౌరవించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు అందుకే ఆ యోధుడి జన్మదినోత్సవాన్ని భారతదేశ వ్యాప్తంగా ఒక వేడుకలా జరుపుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమం లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి గారు, భాస్కర్, కవిడె కుమార్, వినాయక్, శ్యామ్, సతయ్య గౌడ్,సురేష్, గోవింద్, శరత్ గౌడ్, విష్ణుపురి కాలనీ వాసులఎతదితరులు పాల్గొనటం జరిగింది.

## 4వ నేషనల్ ఓపెన్ కరాటే, కుంపు పోటీలలో ప్రతిభ చూపిన బుడోకాయ్ విద్యార్థిని, విద్యార్థులు



**తెలంగాణ వీణ/కుత్బుల్లాపూర్:** 4వ నేషనల్ ఓపెన్ కరాటే,కుంపు ఛాంపియన్ షిప్ పోటీలను యూసుఫ్ గూడా ప్రాంతంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం లో కరాటే లెజెండ్ సుమన్ తల్వార్ ఆర్ ఎస్ కె ఏ చైర్మన్ పర్యవేక్షణలో ఎన్ లక్ష్మీ సామ్రాజ్యం ఆర్ ఎస్ కె ఏ ఫౌండర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో కామేశ్వరరావు సమక్షంలో బుడోకాయ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న 30 మంది విద్యార్థిని ,విద్యార్థులు సోమవారం జరిగిన 4వ నేషనల్ ఓపెన్ కరాటే కుంగ్ ఫు పోటీలలో 30 మంది బంగారు పతకాలను సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా బుడోకాయ్ మాస్టర్ కామేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థిని విద్యార్థులలో కట్టా తేజశ్రీ పోటీ చేసిన రెండు విభాగాలలో బంగారు పతకాలను సాధించడం జరిగిందని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా వారిని ఆదర్శం తీసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. కరాటే లక్ష్మి మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు వారి ఆత్మరక్షణ కొరకు ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని అన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క మహిళల చిన్నతనం నుండి పిల్లలకు కరాటే శిక్షణ ఇప్పించాలని అన్నారు.

## స్వశక్తితో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన వీరుడు శివాజీ మహారాజ్

**- వడ్డేపల్లి రాజేశ్వర్ రావు**



**తెలంగాణ వీణ/కూకట్ పల్లి:** ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి సందర్భంగా, కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ లో, వీర్ శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ,ఏర్పాటు చేసిన నూతన విగ్రహావిష్కరణ మహొత్సవ కార్యక్రమంలో, మల్కాజిగిరి పార్లమెంట్ నాయకులు శ్రీ మల్క కొమురయ్య తో కలిసి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,తల్లి సంరక్షణలో బైరంఖాన్ శిక్షణలో రాటుదేలిన శివాజీ తన యుద్ధ తంత్రాలతో బీజపుర, గోల్కొండ సుల్తానులు, మొఘలులకు ముచ్చెమటలు పట్టించేవాడని, తన గురువు సమర్ధ రామదాసు, తల్లి జిజియాబాయి బోధనలతో హిందూ మత సంరక్షణకు కంకణం కట్టుకున్నాడని అన్నారు. స్వశక్తితో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీర్ శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు





**తెలంగాణ వీణ/ఓయూ:** ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కూకట్పల్లి విభాగ్ ఆధ్వర్యంలో యశ్వంతుడు, కీర్తివంతుడు, సమర్థ్యవంతుడు, మరాఠా యోధుడు శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ గారి జయంతినీ పురస్కరించుకొని మహా శోభయాత్ర ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కాలేజీ నుండి మహబూబ్ డిగ్రీ కాలేజీ వరకు విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ మహా కార్యక్రమంలో చుట్టూ పక్కల ఉన్న ఇంటర్మీడియట్, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కళాశాలల నుండి విద్యార్థులు తండోపతండాలుగా పాల్గొని ఒక కన్నుల పండగ వాతావరణాన్ని నెలకొలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బీ వీ పి రాష్ట్ర అధ్యక్షులు డా. జానారెడ్డి సార్ పాల్గొని మాట్లాడుతు ఛత్రపతి శివాజీ మహారాజ్ గురించి, ఆ మహానుభావుడి జీవిత చరిత్రను గురించి క్షుణ్ణంగా వివరిస్తూ ప్రతి ఒక్క విద్యార్థి మహారాజ్ ఆదర్శంగా తీసుకొని వారు నడిచిన దారిలో నడవలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ బీ వీ పి రాష్ట్ర అధ్యక్షులు డా. జానారెడ్డి , గ్రేటర్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విష్ణు అన్న ,స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాజు గారు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలు మరియు మహేష్, బేగంపేట్ టౌన్ సెక్రటరీ సాకేత్, మారెడపల్లి టౌన్ సెక్రటరీ విజయ్, పీజీ కాలేజీ ప్రెసిడెంట్ చంద్రకాంత్,గగన్. శోభయాత్ర ఆర్గనైజర్ పాండురంగ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నవదుర్గ మహిమ పూజ మహొత్సవం

**తెలంగాణ వీణ/నాచారం:** గొల్లముత్యాలు బావి వద్ద చింతల పరుషరామ్ యాదవ్, చింతల నాగరాజ్ యాదవ్, చింతల హరిణి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నవదుర్గ మహిమ పూజ మహొత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా యాదవులు పెద్ద ఎత్తున అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నవశక్తి మహామాతలైన శ్రీ మహాకాళి, కనకదుర్గ, ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ, రక్తమైసమ్మ, కట్టమైసమ్మ, నల్లపోచమ్మ, గండిమైసమ్మ, ఈదమ్మ అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. కనక దుర్గ మాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ నవదుర్గ మహిమా పూజా మహొత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నామని చింతల పరుశురాం యాదవ్ పేర్కొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ కార్పొరేటర్ల పాలాభిషేకం




**తెలంగాణ వీణ/ఉప్పల్:** జిహెచ్ఎంసికి బడ్జెట్లో రూ.1100 కోట్ల నిధుల కేటాయింపు పట్ల హర్షం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి జిహెచ్ఎంసి కాంగ్రెస్ కార్పొరేటర్లు సోమవారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర బడ్జెట్లో జిహెచ్ఎంసికి రూ.1100 కోట్ల నిధులను కేటాయించడం పట్ల కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం సందర్భంగా బల్దియా కార్యాలయంలో కార్పొరేటర్లు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేయడం జరిగింది జిహెచ్ఎంసి అప్పుల కుప్పగా మార్చిన గత ప్రభుత్వం: రజిత పరమేశ్వర్ రెడ్డి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహానగర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ తెలిపారు. ప్రభుత్వం నిధులను కేటాయిస్తూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు కృషి చేయడాన్ని హర్షించారు.గత ప్రభుత్వం జిహెచ్ఎంసిని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. రూ.7000 కోట్ల అప్పులను చూపిందని ఆరోపించారు.గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా జిహెచ్ఎంసికి నిధులను కేటాయించి ఆదుకున్న చరిత్ర ఉందన్నారు.మేయర్ కనీసం కౌన్సిల్ సమావేశం కూడా ఏర్పాటు చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.జిహెచ్ఎంసి బడ్జెట్లో అంకెల గారడీ తప్ప అభివృద్ధికి నిధులు మాత్రం కనిపించడం లేదని దుయ్యబట్టారు.కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు మందముల రజితపరమేశ్వర్ రెడ్డి ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ,బొంతు శ్రీదేవి ,విజయారెడ్డి ,స్వర్ణరాజ్ శివమణి ఎస్ .ఎన్ రెడ్డి ,జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్ లేని బస్సులతో భాష్యం స్కూల్ పిల్లల నరకయాతన

**- ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**






**తెలంగాణ వీణ/కాప్రా:** ఫిట్ నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న భాష్యం పాఠశాలపై ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. కాప్రా మండలం, సాకేత్ లో గల భాష్యం బ్లూమ్స్ పాఠశాలకు చెందిన బస్సు ఫిట్ నెస్ లేని కారణంగా రోడ్డు మధ్యలోనే ఆగిపోయింది, దీని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారు అన్నారు. ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని ధ్వజమెత్తారు. ఫీజులతో పాటు విద్యార్థుల బాధ్యత ను సైతం పాఠశాలల యాజమాన్యాలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల బస్సులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురౌతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తక్షణమే ఆర్టీఏ అధికారులు స్పందించి పాఠశాలల బస్సులను తనికీ చేయాలని, ఫిట్ నెస్ లేని యెడల బస్సులను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేసారు.

## చత్రపతి శివాజీ జయంతి శోభాయాత్రలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి



**తెలంగాణ వీణ/ఉప్పల్:** ఘట్కేసర్ మండలం ఔషపూర్ గ్రామంలోని విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని సందర్భంగా శోభాయాత్ర ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొని శోభాయాత్రను ప్రారంభించి విద్యార్థులతో పాటు శోభాయాత్రను రోడ్డు మార్గమున కాషాయ జెండాలతో జై భవాని జై శివాజీ అనే నినాదాలతో హొరెత్తించారు. శివాజీ మహారాజ్ శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించిన కాలేజీ యాజమాన్యానికి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శోభాయాత్ర కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు మల్లేష్, జిల్లాల రాజశేఖర్ రెడ్డి, సాయిలు, హిందూ బంధువులు, విద్యార్థినీ విద్యార్థులు, యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాలయం భూమి పూజలో కార్పొరేటర్లు



**తెలంగాణ వీణ/ఉప్పల్:** సోమవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధి కేశవ్ నగర్ కాలనీలో శివాలయం భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేటర్లు 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి 8వ డివిజన్ కార్పొరేటర్ సీసా వెంకటేష్ గౌడ్ 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్య సుమన్ నాయక్ 14వ డివిజన్ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో ఉప్పల్ ఎమ్మెల్యే





**తెలంగాణ వీణ/ఉప్పల్:** సోమవారం రామాంతపూర్ డివిజన్ మెయిన్ రోడ్ మీద ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొని శివాజీ విగ్రహనికి పూలమాల వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని శివ జయంతి అని కూడా పిలుస్తారు, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 19 న జరుపుకుంటారు. భారతదేశం ఈ సంవత్సరం గొప్ప మరాఠా పాలకుడి 394వ జయంతి వేడుకలను జరుపుకుంటుంది. అతను మరాఠా సామ్రాజ్యానికి నాంది పలికిన బీజాపూర్ ఆదిల్షాహి సుల్తానేట్ నుండి ఒక ఎన్‌క్లేవ్‌ను చెక్కిన గొప్ప మరాఠా పాలకులలో ఒకడు. అని ఎమ్మెల్యే శివాజీ గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ ముఖ్యనాయకులు, నాయకురాలు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి

**తెలంగాణ వీణ/ఉప్పల్:** మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ ఎఫ్ సి నగర్‌లో శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ముఖ్యఅతిథిగా మేడ్చల్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు ఘట్కేసర్ మండలం ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి ఎంపీపీ మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డ ఆత్మభిమానానికి పౌరుషానికి ప్రతిక మన చత్రపతి శివాజీ మహారాజ్ వారి జయంతి ఇంత ఘనంగా జరుపుకోవడం ఎంతో సంతోషకరమని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సెంట్రల్ సినీ బోర్డు నెంబర్ మైపాల్ రెడ్డి నాయకులు రాజశేఖర్ రెడ్డి నరేష్ వీరేశం మధుసూదన్ రెడ్డి రవీందర్ రెడ్డి మురళీకృష్ణ ఆర్ఎస్ఎస్ ఇంచార్జ్ నర్సింహారెడ్డి నాయకులు కృష్ణారెడ్డి జైపాల్ రెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా సంజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ఆలిండియా ఐఎన్ టియుసి , ఎఐసిసి సీడబ్లూసి సభ్యుడు, మాజి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ జి. సంజీవ్ రెడ్డి 94వ జన్మ దిన వేడుకలు వైభవంగా ఘనంగా జరిగాయి. నగరంలోని కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ని బ్యాక్ సైడ్ హాలులో జరిగిన ముందుగా కేక్ కట్ చేసిన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిదులు సంజీవ్ రెడ్డి నీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐఎన్ టియుసి కార్యదర్శి, తెలంగాణ స్ట్రీట్ వెండర్స్ అండ్ హకర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిసాలా వెంకట్ మోహన్‌తో పాటు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాజీ జయంతి



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఇమ్లీబన్ ప్రాంతంలో గల శివాజీ విగ్రహం దగ్గర జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి.బిజెపి నాయకుడు మాజీ మంత్రి చెన్నబాయిన కృష్ణ యాదవ్, బిజెపి నగరనాయకుడు మాజీ వార్డ్ మెంబర్ దినేష్ అంబారే ,రాజేష్ అంబారే వినోద్ గోలేకర్ రాకేష్ షిండే తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

**తెలంగాణ వీణ/గాజులరామారం:** కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో వెలసిన రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థాన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి, బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నవగ్రహ లక్ష్మీ గణపతి సహిత చండీ హోమం బ్రహ్మాండంగా జరిగింది, ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ముత్యపాగ సహదేవ్ మాట్లాడుతూ ఈనెల 20వ తారీకు వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని భక్తులు వేల సంఖ్యలో పాల్గొని ఎల్లమ్మ తల్లి కృపకు పాత్రులు కాగలరని కోరారు, ఈరోజు జరిగిన నవగ్రహ లక్ష్మీ గణపతి సహిత చండీ హోమం కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఓయూజేఏసీ చైర్మన్ దరువు అంజన్న, ముత్యపాగ సహదేవ్, పెరమళ్ళ రవి, ముత్యపాగ నరసింహారావు, బైగాని నరసింగరావు, తుపాకుల నర్సింగరావు, ముత్యపాగ సురేష్, పెరమళ్ళ రాజు,పాల్గొన్నారు.



# మీడియాపై దాడి హేయమైన చర్య

**- దాడిని తీవ్రంగా ఖండించిన ఆప్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నల్లాని రమేష్ నాయుడు**



**తెలంగాణ వీణ/అనంతపురం:** అనంతపురం రాప్తాడు సిద్ధం సభ కవరేజ్ కోసం వెళ్లిన ఏబీఎన్ జిల్లా ఫోటోగ్రాఫర్ కృష్ణపై రెచ్చిపోయి వైసీపీ అల్లరి మూకలు రెచ్చిపోయి మూకుమ్మడిగా వందలాది మంది చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది అత్యంత హేయమైన చర్య అని,ఇంత అమానుషంగా ప్రవర్తించి దాడి చేయడం నీచమైన చర్య అని అనంతపురం జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నల్లాని రమేష్ నాయుడు అన్నారు. ఈ దాడిలో ఏబీఎన్ జిల్లా ఫోటోగ్రాఫర్ కృష్ణ తీవ్రంగా గాయపడ్డారని, ఆయనకు ఆమ్ ఆద్మీ పార్టీ తరపున మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి నీతిమాలిన చర్యలు ప్రజాస్వామ్యంకు గొడ్డలి పెట్టు అని ఇటువంటి దాడులను ప్రజాస్వామ్య వాదులు ప్రజాసంఘాలు తీవ్రంగా నిరసించాలని కోరారు.ఇలాంటి చర్యలను బట్టి చూస్తే ఈ రాష్ట్రాన్నే లేకుండా చేయడానికి సిద్ధమైనట్లు అర్థమవుతోంది అని, కాబట్టి ఇలాంటి ప్రభుత్వాలను, పార్టీలను జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓట్లు అనే ఆయుధాలతో అంతమొందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఫ్లెక్సీలను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

**- ఎమ్మెల్యే పుట్టిన రోజు ఫ్లెక్సిలను,హోర్డింగ్‌లను తొలగించడంపై బిఆర్ఎస్ నిరసన**






**తెలంగాణ వీణ/కూకట్ పల్లి:** 19న స్థానిక ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినం సందర్భంగా, బిఅర్ఎస్ పార్టీ కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపెందుకు, కూకట్ పల్లి నియోజకవర్గం లోని పలు డివిజన్లల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ఏర్పాటు చేయటం జరిగిందనీ. వాటిని తొలగించిన జి హెచ్ ఎం సి అధికారులపై చర్యలు తీసుకోవాలని, కూకట్ పల్లి బి.ఆర్.ఎస్ పార్టీ అనుబంధ సంస్థల నాయకులు కూకట్ పల్లి జోనల్ కమీషనర్ కు, సర్కిల్ డిప్యూటీ కమీషనర్ లకు వినతి పత్రాలు అందచేసి, జిహెచ్ఎంసి కూకట్ పల్లి, మూసాపేట సర్కిల్ కార్యాలయాల్లో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులతో కుమ్మక్కు అయి వారికి తొత్తులుగా మారిన కొందరు, జి హెచ్ ఎమ్ సి అధికారులు, పుట్టిన రోజు కి ముందు రోజు 18 తారీకు ఆదివారం ఆర్ధరాత్రి అక్రమంగా, దౌర్జన్యంగా ఫ్లెక్సీలను , హోఎదింగ్స్ లను చించి వేయంటం దుర్మార్గపు చర్య అని అన్నారు. అంతేకాకుండా కొన్ని నెలలుగా ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ లను ఉంచి, బి.ఆర్.ఎస్ పార్టీ ఫ్లెక్సీలు , హోర్డింగ్స్ లను అక్రమంగా తొలగిస్తే చూస్తు ఉరుకొనేది లేదు అని, ఇలాంటి అధికారుల పై చర్య లు తీసుకొనే వరకు ఉరుకోము అని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే అధికారులపై క్రిమినల్ కేసులు పెడతామనీ వారిని హెచ్చరించారు. ఆనంతరం బిమర్ ఎస్ పార్టీ అనుబంధ సంస్థల సంఘాలతో, కూకట్ పల్లి అలాగే కే పి హెచ్ బీ పోలిస్ స్టేషన్లల్లో ఫ్లెక్సీలు హోర్డింగ్స్ తొలగించి న జి.హెచ్.యం.సి అధికారుల పై క్రిమనల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు.ఈ కార్యక్రమంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ పి.బాబురావు, కూకట్పల్లి నియోజక వర్గం యూత్ అధ్యక్షుడు జన్ను సాయిశ్రీనివాస్, ఎస్.సి సెల్ అధ్యక్షులు బొట్టు విష్ణు, మహిళ విభాగం అధ్యక్షురాలు అనితాశ్రీపాల్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, రాజేష్రయ్, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పవన్కుమార్, పాతూరి గోపి, కంచనపల్లి నాగరాజు, భవాని, భారతి, సావిత్రి,కన్నలత, రమా తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య టెక్నో స్కూల్లో మౌలిక సౌకర్యాలను పరిశీలించిన ఎంఈఓ 2, కిరణ్



**తెలంగాణ వీణ/చింతలపూడి:** పాఠశాలలో మౌలిక సౌకర్యాలను పరిశీలించిన ఎంఈఓ కిరణ్ బాబు ఏలూరు జిల్లా చింతలపూడి మండలం చింతలపూడి పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాలలో త్రాగునీటి సౌకర్యాలు మరియు శానిటేషన్ సంబంధించిన సౌకర్యాలను ఎంఈఓ కిరణ్ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కు ఆరోగ్యం పట్ల తగు సూచనలు చేశారు ఈ సీజన్లో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు బయట దొరికే రెడీమేడ్ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు... సౌకర్యాల కల్పనలో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు తెలియజేశారు.

# అవయవ దానం చేసి జీవితాలను కాపాడండి

**- దేహ దానం చేసి వైద్య విద్యార్థుల నైపుణ్యానికి దోహదపడండి**

**- అమ్మ నేత్ర అవయవ దేహ దానం ప్రోత్సాహకుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**





**తెలంగాణ వీణ/కూకట్ పల్లి:** అవయవ దానం పై ఉన్న అనేక అపోహలను తొలగించడానికి కూకట్ పల్లె వెంకట్ రావు నగర్ కాలని.కమ్యూనిటీ హాల్ లో ,అమ్మ నేత్ర,అవయవ ,శరీర దాన ప్రోత్సాకుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త బోయినపల్లి కిషన్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మ నేత్ర,అవయవ,శరీర దానం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జి ఈశ్వర లింగం,సలహాదారు నాగేశ్వర రావు లు మాట్లాడుతూ అవయవదానం ,దేహ దానం పై సమాజంలో నెలకొన్న అనేక అపోహలను ప్రస్తావిస్తూ,శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందిన ఈ దశలో ప్రజలు శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలని కోరారు, లక్షలాది రోగులు అవయవ మార్పిడి ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ఎదురు చూస్తున్నారని, చనిపోయినా జీవించే అవకాశం కేవలం అవయవ దానం చేసిన వారికే లభిస్తుందనీ,అవయవ దానం ద్వారా వారికి పునర్జీవితం ప్రసాదించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు,వైద్య విద్యార్థులు తమ వైద్య విద్యలో చేయవలసిన పరిశోధనకు తగిన మృతదేహాలు లభించడం లేదని, ఫలితంగా వైద్య విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం లోపిస్తుందని తెలిపారు,ఇందుకు దాతలు ముందుకు వచ్చి తమ మరణానంతరం తమ దేహాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం దానం చేయాలని కోరారు.డాక్టర్ భార్గవి గైనకాలజిస్ట్ మాట్లాడుతూ,అవయవ మార్పిడి ద్వారా పునార్జీవితం పొందడానికి ,లక్షలాది మంది రోగులు నమోదు చేసుకుని,దాతల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు, గత సంవత్సరం మూడు లక్షల మంది రోగులు అవయవ మార్పిడి కోసం నమోదు చేసుకోగా, ఆ సంఖ్య ప్రతి పది నిమిషాలకు ఒక రోగి చొప్పున పెరుగుతున్నదని,అయితే దాతల సంఖ్య 0.8 శాతం మాత్రమే ఉందని,దాతలు ఉదార స్వభావంతో ముందుకు వస్తే తప్ప వారి జీవితం ముందుకు సాగదని వారు అర్ధాంతరంగా జీవితాలు ముగించాల్సిందే అని తెలిపారు, కుమారి శ్రావణి మాట్లాడుతూ,మరణానంతరం లభించే ఇన్స్యూరెన్స్ సొమ్ము కోసం పాలసీని తీసుకుంటున్న ప్రజలు,మరణానంతరం తమ అవయవాలను, దేహాన్ని దానం చేయడానికి అదే స్ఫూర్తితో ముందుకి రావాలని కోరారు.సభాధ్యక్షుడు కిషన్ రావు మాట్లాడుతూ,అవయవ దానం,దేహ దానం పై ఉన్న అపోహలను తొలగించడానికి ఇలాంటి సదస్సులు విస్తృతంగా నిర్వహించాలని కోరారు, ఈ దిశగా సదస్సు నిర్వహణకు చొరవ చూపిన పసుపులేటి రమాదేవి,బి వి రాఘవయ్య దంపతులను అభినందించారు,వేగంగా విలువలు మారుతున్న ప్రస్తుత సమాజంలో ఇతరుల ప్రాణాలను కాపడాటానికి వైద్య పరిశోధనల నిమిత్తం,అవయవ దానం ,దేహ దానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలను అభినందించారు, ఇందుకు అమ్మ నేత్ర,అవయవ,దేహ దానం ప్రోత్సాక సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు,ఈ సమావేశంలో ఐద్వా సీనియర్ నాయకురాలు వాణి, ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు ఆశాలత,ప్రగతి నగర్ మాజీ సర్పంచ్ శాంతి,బి హెచ్ ఈ ఎల్ ఉద్యోగుల నాయకులు సాంబశివ రావు,వినోద్,లక్ష్మి వినోద్, తదితరులు అవయవ దానం,దేహ దానం ఆవశ్యకతను వివరించారు, రమా దేవి దేహ దానం కోసం వాగ్దాన పత్రం ఇదివరకే సమర్పించానని తెలిపారు,రాఘవయ్య దేహ దానం కోసం వాగ్దాన పత్రాన్ని ఈశ్వర లింగం అందజేయడం జరిగింది,ఈ అవగాహన సదస్సు నిర్వహణకు సహకరించిన సుధ ,అలాగే వెంకట్రావు నగర్ కాలని కి చెందిన మహిళలకు రమా దేవి కృతజ్ఞతలు తెలిపారు.

# సీతక్కని విమర్శించే స్థాయి, అర్హత ఎవరికి లేవు...



**తెలంగాణ వీణ/షాపూర్ నగర్:** గత ఇరవై యేండ్ల రాజకీయ జీవితంలో ఒక్క అవినీతి మచ్చ లేని నాయకురాలు సీతక్క ప్రజా సేవ తప్ప మరొకటి తెలియని నిస్వార్థ నాయకురాలు సీతక్క గారిపై కావాలని కొందరు ప్రతి పక్ష నేతలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. సీతక్క మీద ఒక్క అవినీతి మచ్చ లేదని, తన పేరుని, కీర్తిని కించపరచడానికి కొందరు దుండగులు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. కబర్ధార్ అసత్య ఆరోపణలు చేయడం కాదు దమ్ముంటే ఆధారాలతో రండి చర్చకు మేము సిద్ధం మీరు సిద్ధం అయితే రండి అని సవాలు విసిరిన తెలంగాణ స్టేట్ నసుయ్ జనరల్ సెక్రటరీ గొల్ల జాన్ ...సీతక్క మీద అసత్య ప్రచారాలు, అసత్య ఆరోపణలు చేస్తున్న వారందరూ దమ్ముంటే ఆధారాలు చూపించాలని అన్నారు. కావాలని సీతక్క గారి పేరును దెబ్బ తీయడానికి కొందరు ప్రతి పక్ష నేతల కుట్ర ఇది అని అన్నారు. ఈ సందర్భంగా గొల్లజాన్ గారు మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రజా సేవ కోసం పరితపించే నాయకురాలు సీతక్క గారని, గత ఇరవై యేండ్ల రాజకీయ జీవిత చరిత్రలో ఏనాడూ అవినీతి మచ్చ అనేది లేదని, కావాలని కొందరు దుండగులు మరియు ప్రతి పక్ష పార్టీ నేతలు సీతక్క గారిపై అసత్య ప్రచారాలు, అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తూ లారీలు పట్టుబడ్డాయని అభియోగాలు చేస్తున్న ప్రతి పక్ష నేతలు రుజువులు ఉంటే ముందుకు రావాలని అంటున్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా సీతక్క గారి మీద పీఏ సుజిత్ రెడ్డి గారి మీద ఆరోపణలు చేయడం నిజంగా దుర్మార్గం అని అన్నారు. సీతక్క గారు గత ఇరవై యేండ్ల నుండి ఎటువంటి అవినీతి మచ్చ లేని, ఆదివాసీ అడవి బిడ్డ అని, అలాంటి గిరిజన బిడ్డ మీద కావాలని ఆరోపణలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తాం అని, ఇప్పటికీ అయిన నిజాలు తెలుసుకుని మాట్లాడాలి కానీ నోటికి ఎంత వస్తె అంత మాట్లాడకూడదు అని అన్నారు.

## కోహ్లీ ఔట్ అయితేనే టీమ్‌కు మంచిది..! రన్ మిషీన్‌పై హర్షా భోగ్లే షాకింగ్ కామెంట్స్

ఆధునిక క్రికెట్‌లో 'గ్రేటెస్ట్ బ్యాటర్' అని పిలవదగ్గ అతికొద్ది మంది క్రికెటర్లలో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఒకడు అనడంలో సందేహమే లేదు. ఫార్మాట్ ఏదైనా కోహ్లీ నిలకడగా రాణిస్తూ సుమారు దశాబ్దంన్నర కాలంగా భారత క్రికెట్‌కు ఎనలేని సేవలందిస్తున్నాడు. అటువంటి కోహ్లీపై ప్రముఖ క్రికెట్ కామెంటేటర్ హర్షా భోగ్లే.. అతడు ఔట్ టీమ్‌కు లాభం చేకూరుతుందని మాట్లాడిన వీడియో క్లిప్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వీడియోపై కోహ్లీ ఫ్యాన్స్ తెగ మండిపడుతున్న తరుణంలో భోగ్లే దీనిపై స్పష్టతనిచ్చాడు.




## మాట నిలబెట్టుకున్న బీసీసీఐ.. నేపాల్‌కు సాయం.. ఆ రెండు జట్లతో ముక్కోణపు సిరీస్



నేపాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాన్) కు ఇచ్చిన మాటను బీసీసీఐ నిలబెట్టుకుంది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ సమీపిస్తున్న వేళ తమను ఆదుకోవాలని, తమ క్రికెటర్లకు భారత్‌లో శిక్షణ ఇప్పించాలని కోరిన క్యాన్ అభ్యర్థనకు బీసీసీఐ సానుకూలంగా స్పందించింది. ఆర్థిక ఇబ్బందులతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా తమ క్రికెటర్లకు భారత్‌లో ట్రైనింగ్‌తో పాటు ఇక్కడ మ్యాచ్‌లు ఆడించాలని గత నెలలో క్యాన్.. బీసీసీఐని కోరింది. ఈ ఏడాది అమెరికా – వెస్టిండీస్ వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్‌లో పాల్గొననున్న నేపాల్‌కు ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని కోరిన క్యాన్‌కు బీసీసీఐ ఆపన్నహస్తం అందించింది. దేశవాళీ క్రికెట్‌లో భాగంగా గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ రన్నరప్ అయిన బరోడాతో పాటు పటిష్టమైన గుజరాత్ జట్టుతో నేపాల్ ముక్కోణపు సిరీస్ ఆడనుంది. ఈ మేరకు క్యాన్ తాజాగా షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. ఫ్రెండ్‌షిప్ కప్‌గా నామకరణం చేసిన ఈ ట్రై సిరీస్‌లో నేపాల్.. గుజరాత్, బరోడాతో నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. మార్చి 31న మొదలయ్యే ఈ సిరీస్ ఏప్రిల్ 7న ముగుస్తుంది. టీ20 ఫార్మాట్‌లో ఈ సిరీస్ జరగనుంది. గ్రూప్ స్టేజ్‌లో నేపాల్.. బరోడా, గుజరాత్‌లతో రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది. గుజరాత్‌లోని వాపిలో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. బరోడా జట్టుకు హార్దిక్ పాండ్యా సోదరుడు కృనాల్ పాండ్యా సారథిగా వ్యవహరిస్తుండగా గుజరాత్ జట్టులో పియుశ్ చావ్లా, యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ వంటి టాలెంటెడ్ క్రికెటర్లున్నారు.

## అట్కిన్సన్ ఔట్.. లంక పేసర్‌ను తీసుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్

వచ్చే నెల నుంచి మొదలుకావాల్సి ఉన్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) – 17లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ గుడ్ బై చెప్పాడు. వర్క్‌లోడ్ కారణంగా అట్కిన్సన్.. ఐపీఎల్ మిస్ అవనున్నాడు. అతడి స్థానంలో శ్రీలంక పేసర్ దుష్మంత చమీరను కేకేఆర్ జట్టులోకి తీసుకుంది. ఈ మేరకు ఐపీఎల్‌తో పాటు కేకేఆర్ ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రకటనలు విడుదల చేశాయి. చమీరను రూ. 50 లక్షల రిజర్వ్ ధరకు కేకేఆర్ దక్కించుకుంది.శ్రీలంక పేసర్ చమీర.. 2018 నుంచి ఐపీఎల్ ఆడుతున్నాడు. తన తొలి సీజన్‌లో ఆర్సీబీ తరఫున ఆడిన చమీర.. 2021వ సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. 2022లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ప్రధాన బౌలర్‌గా ఉన్నాడు. ఆ సీజన్‌లో అతడు 9 వికెట్లు పడగొట్టాడు.



### ఆర్సీబీ, గుజరాత్‌లకు భారీ షాకులు..

## డబ్ల్యూపీఎల్-2 నుంచి ఆ ఇద్దరూ ఔట్



మరో నాలుగు రోజుల్లో మొదలుకాబోయే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో పాటు గుజరాత్ జెయింట్స్ జట్లకు భారీ షాక్ తగిలింది. ఆర్సీబీ ఆల్ రౌండర్ కనిక అహుజా, గుజరాత్ జెయింట్స్ పేసర్ కాశ్వీ గౌతమ్‌లు రెండో సీజన్ నుంచి తప్పుకున్నారు. కాశ్వీకి గాయమవగా అహుజా మాత్రం మెంటల్ స్ట్రెస్ కారణంగా ఈ సీజన్ నుంచి తప్పుకుంది. డబ్ల్యూపీఎల్–2 వేలంలో ఏకంగా రూ. 2 కోట్లకు గుజరాత్ సొంతం చేసుకున్న కాశ్వీ.. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే లీగ్‌కు దూరమవడం గమనార్హం.కనిక అహుజా ఆర్సీబీ తరఫున గత సీజన్‌లో ఆ జట్టు ఆడిన 8 మ్యాచ్‌లలో ఏడింట్లో ఆడింది. ఆల్‌రౌండర్ అయిన అహుజా.. 98 పరుగులు చేసి 2 వికెట్లు పడగొట్టింది. లోయరార్డర్‌లో మెరుపులు మెరిపించే అహుజా స్థానాన్ని ఆర్సీబీ.. లెఫ్టార్మ్ పేసర్ శ్రద్ధా పోఖర్కర్‌తో భర్తీ చేస్తోంది. శ్రద్ధా దేశవాళీలో నిలకడగా రాణిస్తోంది. రూ. 10 లక్షల రిజర్వ్ ప్రైస్‌తో ఆమె ఆర్సీబీతో చేరనుంది.

## బుమ్రాకు రెస్ట్.. రాహుల్ ఫిట్.. బలయ్యేది అతడేనా..?

భారత్ – ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా వైజాగ్, రాజ్‌కోట్‌లలో గెలిచిన టీమిండియా 2–1 ఆధిక్యంలో ఉంది. ఈనెల 23 నుంచి ఇరు జట్ల మధ్య రాంచీ వేదికగా నాలుగో టెస్టు జరగాల్సి ఉంది. అయితే నాలుగో టెస్టులో భారత జట్టులో పలు మార్పులు జరిగే అవకాశముంది. పేసు గుర్రం జస్ప్రిత్ బుమ్రాకు రాంచీ టెస్టులో విశ్రాంతినిచ్చే అవకాశాలుండగా తొడ కండరాల గాయంతో రెండు, మూడు టెస్టులకు విఫలమైన కెఎల్ రాహుల్ పూర్తి పిట్నెస్ సాధించి నాలుగో టెస్టులో ఆడేందుకు సిద్ధమవుతున్నాడని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. మరి రాహుల్ వస్తే వేటు పడేది ఎవరిపై..? అన్నది ఆసక్తికరంగా మారింది.

### రాహుల్ ఎంట్రీ..

హైదరాబాద్ టెస్టులో సెంచరీకి సమీపంగా వచ్చిన రాహుల్.. ఆ మ్యాచ్‌లో గాయం కారణంగా వైజాగ్ టెస్టుకు దూరమయ్యాడు. రాజ్‌కోట్‌లో అతడు ఆడతాడని భావించినా పూర్తి ఫిట్నెస్ సాధించలేదని టీమ్ మేనేజ్‌మెంట్ అతడిని పక్కనబెట్టింది. కానీ గతవారమే అతడు 90 శాతం ఫిట్నెస్ సాధించాడని ప్రస్తుతం మ్యాచ్ ఆడే ఫిట్నెస్ సొంతం చేసుకున్నాడని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు హైదరాబాద్‌లో భారత్‌పై గెలిచిన ఇంగ్లండ్‌కు నిర్జీవమైన వైజాగ్ పిచ్‌పై చుక్కలు చూపి సిరీస్‌లో టీమిండియాను పోటీలోకి తెచ్చాడు బుమ్రా.. ఈ సిరీస్‌లో అతడు ఇప్పటికే 17 వికెట్లు పడగొట్టి హయ్యేస్ట్ వికెట్ టేకర్‌గా ఉన్నాడు. మూడో టెస్టులోనే బుమ్రాకు రెస్ట్ ఇస్తారని వార్తలు వచ్చినా టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం అతడిని ఆడించింది. అయితే వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు రాంచీ టెస్టులో విశ్రాంతినిచ్చి పేసర్లకు అనుకూలంగా ఉండే ధర్మశాలలో ఆడించనున్నట్టు తెలుస్తున్నది. ఒకవేళ రోహిత్ సేన రాంచీలోనే ఇంగ్లండ్ పనిపడితే ధర్మశాలలో కూడా బుమ్రాను ఆడించకపోవచ్చు.



## రాజ్‌కోట్‌లో భారీ విజయం.. ధోని, విరాట్‌లను దాటిన హిట్‌మ్యాన్



రాజ్‌కోట్ వేదికగా ఇంగ్లండ్‌తో ముగిసిన మూడో టెస్టులో రోహిత్ శర్మ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు.. ప్రత్యర్థిపై 434 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. భారత క్రికెట్ చరిత్రలో టెస్టులలో పరుగులపరంగా ఇదే అతిపెద్ద విజయం. కోహ్లీ, షమీ, కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, ఛతేశ్వర్ పుజారా వంటి సీనియర్లు లేకున్నా కుర్రాళ్లతోనే రోహిత్ శర్మ అద్భుతాలు సృష్టిస్తున్నాడు. ఈ గెలుపుతో రోహత్.. భారత్ తరఫున అత్యధిక విజయాల శాతం కలిగి ఉన్న సారథిగా నిలిచాడు. ఈ క్రమంలో అతడు దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనితో పాటు అగ్రెసివ్ కెప్టెన్ విరాట్ కోహ్లీని కూడా అధిగమించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌కు సారథ్యం వహిస్తూ అత్యధిక విజయాల శాతం కలిగిన సారథిగా రికార్డులకెక్కాడు.అంతర్జాతీయ స్థాయిలో ధోని.. భారత జట్టును 2007 నుంచి 2018 దాకా మూడు ఫార్మాట్లలో కలిపి 332 మ్యాచ్‌లలో సారథిగా వ్యవహరించాడు. ఇందులో 178 మ్యాచ్‌లలో గెలిచి 120 మ్యాచ్‌లలో ఓడిపోయాడు. ధోని విజయాల శాతం 53.61గా ఉంది. ఇక ధోని వారసుడిగా 2013లో భారత జట్టు పగ్గాలు (టెస్టులలో) చేపట్టిన కోహ్లీ.. 2022 దాకా 213 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా ఉన్నాడు.

## వరుసగా రెండు డబుల్ సెంచరీలు.. అగ్రస్థానానికి జైస్వాల్



టీమిండియా యువ సంచలనం, ఇంగ్లండ్‌తో వరుసగా రెండు టెస్టులలో ద్విశతకాలు బాది భారత క్రికెట్‌లో సూపర్ స్టార్‌గా ఎదుగుతున్న యశస్వీ జైస్వాల్ రికార్డుల దుమ్ముదులుపుతున్నాడు. ఆదివారం రాజ్‌కోట్ వేదికగా ముగిసిన మూడో టెస్టులో భాగంగా రెండో ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (214) చేసిన జైస్వాల్.. ఈ క్రమంలో 12 భారీ సిక్సర్లు బాది ఒక టెస్టులో అత్యధిక సిక్సర్లు బాదిన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు. నిలకడగా రాణిస్తున్న జైస్వాల్.. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023–25 సైకిల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. నిన్నటిదాకా ఆ జాబితాలో ఉన్న ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాను అధిగమించి జైస్వాల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు.

## రంజీలలో రైల్వేస్ సరికొత్త చరిత్ర.. భారీ ఛేదనలో రికార్డు విజయం

రంజీ క్రికెట్ చరిత్రలో రైల్వేస్ సంచలనం సృష్టించింది. 1934 నుంచి మొదలైన ఈ టోర్నీ చరిత్రలో రైల్వేస్.. అత్యధిక పరుగుల ఛేదనను విజయవంతంగా సాధించింది. రంజీ ట్రోఫీ 2024 సీజన్‌లో భాగంగా ఎలైట్ గ్రూప్ సి లో ఉన్న రైల్వేస్.. ఫైనల్ లీగ్ మ్యాచ్‌లో త్రిపుర విధించిన 378 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో వంద పరుగులు చేయడానికి నానా తంటాలు పడ్డ రైల్వేస్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం భారీ లక్ష్యాన్ని ఛేదించింది. తద్వారా గతంలో సౌరాష్ట్ర పేరిట ఉన్న 372 పరుగుల ఛేదన రికార్డును బ్రేక్ చేసింది. త్రిపురలోని మహారాజా బిర్ బిక్రమ్ కాలేజ్ స్టేడియం వేదికగా ఈనెల 16న మొదలైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన త్రిపుర.. 149 రన్స్‌కు ఆలౌట్ అయింది. బదులుగా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో రైల్వేస్.. 105 పరుగులకే ఆలౌట్ అయి త్రిపురకు 44 పరుగుల ఆధిక్యాన్ని అందించింది. రెండో ఇన్నింగ్స్‌లో త్రిపుర.. 333 పరుగులు చేయడంతో రైల్వేస్ ఎదుట 378 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం రైల్వేస్ ఛేదనలో 31 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. కానీ ఓపెనర్ ప్రథమ్ సింగ్ (169 నాటౌట్), మహ్మద్ సైఫ్ (106) లు శతకాలతో రాణించారు. అరిందమ్ ఘోష్ (40) , ఉపేంద్ర యాదవ్ (27 నాటౌట్)లు ఆఖర్లో ప్రథమ్ సింగ్‌కు అండగా నిలిచి 378 లక్ష్యాన్ని సాధించి ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకున్నారు.




# ఓటీటీలోకి మోహన్‌లాల్ 'మలైకోట్టై వాలిబన్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటించిన తాజా చిత్రం మలైకోట్టై వాలిబన్. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమాకు లిజో జోష్ పెల్లిస్సెరీ దర్శకత్వం వహించాడు. రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా మిగిలింది. కథ, కథనం ఏవి కూడా ఆసక్తికరంగా లేకపోవడంతో వారం లోపే దుకాణం సర్దేసింది. సుమారుగా రూ.67 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా ఫైనల్ రన్ లో కేవలం రూ.6.2 కోట్ల షేర్ ను మాత్రమే రాబట్టింది. మోహన్ లాల్ కెరీర్ లోనే కాదు మలయాళ సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ డిజాస్టర్ సినిమాగా మలైకోట్టై వాలిబన్ నిలిచింది. ఇక ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉంటుందని మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది.ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ వేదికగా ఈ చిత్రం ఫిబ్రవరి 23నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. హరీష్ పేరడి ఈ చిత్రంలో కీ రోల్ పోషించగా.. బాలీవుడ్ యాక్టర్లు విద్యుత్ జమ్వాల్, రాధికా ఆప్టే, సోనాలీ కులకర్ణి, డానిష్ సేత్, మనికంద రాజన్, ఆండ్రియా రావెరా కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీని మ్యాక్స్ ల్యాబ్స్-సెంచరీ ఫిలిమ్స్ బ్యానర్లపై జాన్-మేరీ క్రియేటివ్ తెరకెక్కించారు.

# ఆఫీషియల్.. 'ఆర్‌సీ16'లో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్




దివంగత అందాల తార శ్రీదేవి గారాలపట్టిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది బాలీవుడ్ నటి జాన్వీకపూర్. ఈ భామ ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీపై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎన్టీఆర్ జోడీగా 'దేవర' సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా.. దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే జాన్వీ కపూర్ మరో తెలుగు సినిమాకు ఒకే చెప్పింది.మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో ఓ చిత్రం పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. 'ఆర్‌సీ16' వర్కింగ్ టైటిల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ కలసి ఈ ప్రాజెక్టును నిర్మించనున్నాయి. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా దీన్ని తీర్చిదిద్దనున్నారు మేకర్స్. అయితే ఈ సినిమాకు సంబంధించి నటీనటుల ఆడిషన్స్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూవీలో హీరోయిన్‌ను ఫిక్స్ చేసింది. ఈ సినిమాలో చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించనున్నట్లు ఖరారు అయ్యింది. ఈ విషయాన్ని జాన్వీకపూర్ తండ్రి బోనీకపూర్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు."జాన్వీకపూర్ ఇప్పటికే ఎన్టీఆర్‌తో కలిసి 'దేవర'లో నటిస్తోంది. ఈ సినిమాతో రామ్ చరణ్ ప్రాజెక్ట్‌కు కూడా సంతకం చేసింది. త్వరలోనే ఈ 'ఆర్‌సీ16' షూటింగ్‌లో పాల్గొంటుంది. ఎన్టీఆర్, చరణ్‌లు తెలుగులో పెద్ద స్టార్స్. వారి పక్కన నటించడానికి తన నటన, భాషను పెంచుకునేందుకు వీలు దొరికినప్పుడల్లా తెలుగు సినిమాలు చూస్తుంది. 'దేవర', 'ఆర్‌సీ16' సినిమాలు బాక్సఫీస్ వద్ద మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్న ఇంకా ఇవే కాకుండా సూర్యతో కూడా తమిళంలో మరో సినిమా చేసేందుకు సిద్ధంగా ఉంది". అంటూ బోనీకపూర్ వెల్లడించారు.

# 3 రోజుల్లో రూ.20 కోట్లు.. సైలెంట్‌గా కలెక్షన్స్ కొల్లగొడుతున్న 'ఊరు పేరు భైరవకోన'



టాలీవుడ్ నటుడు సందీప్ కిషన్ నటించిన తాజా చిత్రం ఊరు పేరు భైరవకోన . ఫాంటసీ డ్రామా నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాకు వీఐ ఆనంద్ దర్శకత్వం వహించాడు. వర్ష బొల్లమ్మ కావ్య థాపర్ హీరోయిన్‌లుగా నటించారు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రీమియర్ షోలకే మంచి టాక్ రావడంతో విడుదల తరువాత సందీప్ కిషన్ హిట్ కొట్టడం ఖాయం అనుకున్నారు.అయితే చెప్పినట్లుగానే ఈ సినిమా మొదటి రోజే మంచి ఓపెనింగ్స్ రాబట్టింది. ఫస్ట్ డే వరల్డ్ వైడ్‌గా రూ. 6 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇక తాజాగా ఈ సినిమా మూడో రోజు రికార్డ్ కలెక్షన్స్ సాధించింది. ఈ సినిమా మూడు రోజులకు గాను వరల్డ్ వైడ్‌గా రూ.20 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. ఇక రానున్న వారం రోజులు పెద్ద సినిమాలేవి విడుదల లేకపోవడంతో ఈ వసూళు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా తెరకెక్కించారు. ఇక టైగర్ తర్వాత సందీప్ కిషన్, వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో వచ్చిన రెండో సినిమా ఇది.

# బాఫ్టా అవార్డుల వేడుకలో మెరిసిన దీపికా పదుకొణె..



ప్రపంచ చలన చిత్ర రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 77వ బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అవార్డ్స్ అవార్డుల వేడుక ఆదివారం రాత్రి లండన్‌లో అట్టహాసంగా జరిగిన విషయం తెలిసిందే. ఇక ఈ అవార్డు వేడుకలో బాలీవుడ్ నటి దీపికా పదుకొణె స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ప్రముఖ బాలీవుడ్ డిజైనర్ సబ్యసాచి చీరలో ఈ వేడుకకు వచ్చిన దీపికా వేదికపై మెరిసిపోయారు. ఇక బాఫ్టా అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె ప్రజెంటర్‌గా వ్యవహరించారు. 'బెస్ట్ ఫిల్మ్ నాట్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్' అనే కేటగిరీలో అవార్డు గెలుచుకున్న 'ది జోన్ అఫ్ ఇంట్రెస్ట్' సినిమాకు దీపికా అవార్డును ప్రదానం చేశారు. అయితే భారత్ నుంచి ఈ వేడుకలో పాల్గొన్న ఏకైక భారతీయ నటి దీపికానే కావడం విశేషం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.మరోవైపు ఈ అవార్డుల్లో హాలీవుడ్ చిత్రం 'ఓపెన్‌హైమర్' సత్తా చాటింది. ఏకంగా ఏడు విభాగాలలో అవార్డులు గెలుచుకుంది. ఈ సినిమాకు ఉత్తమ నటుడిగా (సిలియన్ మర్ఫీ), ఉత్తమ దర్శకుడిగా (క్రిస్టఫర్ నోలన్), ఉత్తమ సహాయ నటుడిగా (రాబర్ట్ డౌనీ జూనియర్), ఉత్తమ ఒరిజినల్ స్కోర్ (లుడ్విగ్ గోరాన్సన్), ఉత్తమ చిత్రం సహా మొత్తం ఏడు విభాగాల్లో అవార్డులు గెలుచుకుంది.

# పవన్ ఫ్యాన్స్‌కు పండగే.. మహాశివరాత్రికి 'హరి హర వీరమల్లు' అప్‌డేట్.?




టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. ఇందులో ఒకటి హరిహర వీరమల్లు . ఈ సినిమాకు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తున్నాడు. గత ఏడాది స్టార్ట్ అయిన ఈ సినిమా ఇప్పటివరకు సగం కూడా షూటింగ్ పూర్తి చేసుకోలేదు. ఇక పవన్ కల్యాణ్ ఉన్న పొలిటికల్ కమిట్‌మెంట్స్‌తో ఈ సినిమా షూటింగ్ అప్పుడప్పుడు జరుగుతూ వస్తుంది. అయితే చిత్రం నుంచి అప్‌డేట్ వచ్చి చాలా రోజుల అయిన విషయం తెలిసిందే. అప్పుడెప్పుడో పవన్ బర్త్ డే సందర్భంగా కొత్త పోస్టర్ వదలడం చేశారు. ఇదిలావుంటే పవన్ ఫ్యాన్స్‌ను ఖుషి చేస్తూ ఒక సాలిడ్ న్యూస్ బయటకు వచ్చింది.మహాశివరాత్రి సందర్భంగా ఈ చిత్రం నుంచి ప్రోమో విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇదే విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా దీనిపై చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. క్రిష్ టీం ఇప్పటికే రిలీజ్ చేసిన హరిహరవీరమల్లు పోస్టర్లు, గ్లింప్స్ వీడియోలు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి.

# పెను ప్రమాదం నుంచి బయపడ్డ నేషనల్‌క్రష్ రష్మిక..



'ఈ రోజు మేం మృత్యువు నుంచి తప్పించుకున్నాం' అంటూ హీరోయిన్ శ్రద్ధాదాస్‌తో కలిసి దిగిన ఓ ఫొటోను తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది నేషనల్ క్రష్ రష్మిక. ఈ పోస్ట్ చూసిన ఆమె అభిమాను లందరూ కంగారు పడిపోయారు. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల ముంబయ్ నుంచి హైదరాబాద్ విమానం ప్రయాణం చేసింది ఈ అందాలభామ. ఈ ప్రయాణంలోనే పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది.ముంబయి నుంచి టేకాఫ్ అయిన 30 నిమిషాలకే రష్మిక ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో పైలెట్ చాకచక్యంగా విమానాన్ని ముంబయ్‌లోనే అత్యవసర ల్యాండింగ్ చేశాడు. దీంతో ప్రయాణంలోని వారంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ విమానంలో రష్మికతోపాటు మరో కథానాయిక శ్రద్ధాదాస్ కూడా ప్రయాణిస్తుండటం విశేషం. ఈ భయానక అనుభవాన్ని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది రష్మిక. ఇక రష్మిక కెరీర్ విషయానికొస్తే.. ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్ సినిమాలతో ఆమె బిజీబిజీ. 'పుష్ప2', రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, చావా ప్రస్తుతం ఆమె చేతిలోవున్న సినిమాలు.

# తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖ నటి శ్రీలీల

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ నటి శ్రీలీల దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయం వద్దకు చేరుకున్న నటికి తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.సంప్రదాయ లంగాఓనీలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండలంలో నటికి తితిదే అధికారులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం బయట నటిని చూసిన అభిమానులు ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు.




రిపోర్టర్లు కావలెను

తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

తెలుగు దినపత్రిక

69 TV తెలుగు

తెలుగు లో రాయగల సమర్ధత ,
సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ వీణ తెలుగు దినపత్రిక
మీకు సరైన వేదిక

అన్నీ జిల్లాలు , మండలాలు, నియోజకవర్గాల పరిధిలో
పని చేసేందుకు అవకాశం కలిపిస్తోంది.

వివరాల కొరకు సంప్రదించల్సిన ఫోన్ నెంబర్ లు

email: telanganaveenaofficial@gmail.com
Website: https://telanganaveena.com/

91 90525 22626
91 98485 99616



Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written